ప్రజాదర్బార్
తెలుగు దినపత్రిక
జిల్లా అనుబంధం
శుక్రవారం,ఏప్రిల్,24,2026 పేజీలు : 8

## అల్వాల్‌లో గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్ పట్టివేత

అల్వాల్, ఏప్రిల్ 23: అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా గ్యాస్ సిలిండర్లు, తరలిస్తున్న ఇద్దరిని అల్వాల్ పోలీసులు పట్టుకున్నారు. గురువారం అల్వాల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హస్మత్‌పేట్ అంజయ్య నగర్ వద్ద తనిఖీల్లో టిఎస్34 టిఏ 8006 బొలెరో వాహనంలో 69 ఇండియన్ గ్యాస్ సిలిండర్లు (55 ఖాళీ, 14 నింపినవి) స్వాధీనం చేసుకున్నారు. సరైన పత్రాలు లేకపోవడంతో బ్లాక్ మార్కెటింగ్‌కు తరలిస్తున్నట్లు గుర్తించారు. నిందితులు అనిల్ సావన్ (22), అనిల్ కిలేర్ (21)లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని అల్వాల్ పోలీసులు వెల్లడించారు.

# ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య :.జిల్లా కలెక్టర్







నిర్మల్, ఏప్రిల్ 23(ప్రజాదర్బార్, ప్రతినిధి) ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం సంక్షేమ వారోత్స వాల కార్యక్రమంలో భాగంగా గురువారం నిర్మల్ గ్రామీణ మండలం, డ్యాంగాపూర్ ప్రభుత్వ బాలుర ఆశ్రమం ఉన్నత పాఠశాలలో విద్యార్థుల, పోషకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు .కార్యక్రమానికి వచ్చిన కలెక్టర్ కు అధికారులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. ముందుగా పాఠశాలలోని సరస్వతి అమ్మవారి విగ్రహానికి కలెక్టర్, అధికారులు, పోషకులు కలిసి పూజలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్ర మంలో భాగంగా సంక్షేమ వారోత్సవాలు నిర్వహించు కుంటున్నామని అన్నారు. పోషకులు, తల్లిదండ్రుల సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఈ సమావేశాల వల్లనే పాఠశాల ప్రగతి ఆధారపడి ఉంటుందన్నారు. విద్యార్థుల ప్రగతి వివరాలు కూడా ఈ సమావేశాల వల్ల తల్లిదండ్రులకు తెలుస్తాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కలవడం వల్ల పాఠశాల విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఆస్కారం ఉంటుందన్నారు. విద్యార్థులు అందరూ సెలవులు ముగియగానే సమయానికి పాఠశాలకు రావాలని అన్నారు. తల్లిదండ్రులు ఈ విషయంలో చొరవ చూపాలని పేర్కొన్నారు. పాఠశాల ప్రహరీ గోడ సమస్య తొలగిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల నీటి సౌకర్యానికై బోరు వేస్తామని చెప్పారు.ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు అన్ని నైపుణ్యాలు, అర్హతలు ఉన్న ఉపాధ్యాయులతో విద్యాబోధన అందించబడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామని వివరించారు. కామన్ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న పిల్లలందరూ చదువులు, ఆటల్లో అద్భుత ప్రతిభ చాటుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల విద్యార్థులకు వార్షిక ప్రగతి నివేదికలు అందించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన, క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులను శాలువాలతో సత్కరించి, బహుమతులు, జ్ఞాపికలు అందించారు. డిటిడిఓ అంబాజీ, డీఈవో భోజన్న, సిపిఓ జీవరత్నం, తహసిల్దార్ ప్రభాకర్, ప్రధానోపాధ్యాయురాలు శైలజ, గ్రామసర్పంచ్, ఉప సర్పంచ్ లు నవీన్, హరీష్, ఇతర అధికారులు, విద్యార్థుల పోషకులు, తదితరులు పాల్గొన్నారు.

## 'మంగళమై' ని ప్రారంభించిన రికాన్ ఆయిల్

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ప్రజా దర్బార్) : హైదరాబాద్ రికాన్ ఆయిల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క ప్రముఖ ప్రీమియం తినదగిన, దీప నూనెల తయారీదారు, తన ప్రసిద్ధ 'మంగళమై' దీపం, దియా నూనెను ఇప్పుడు జెప్టో, స్విగ్గీ ఇన్ మార్ట్, బిగ్ బాస్కెట్లలో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆ సంస్థ ప్రతినిధులు గురువారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ఈ వ్యూహాత్మక విస్తరణ, బ్రాండ్ యొక్క ప్రీమియం, ప్రజాదరణ పొందిన దీపం నూనెలను హైదరాబాద్, పూణే, ముంబై, నవీముంబై, నాగ్పూర్, విశాఖపట్టణం, గురుగ్రామ్, విజయవాడ, అహ్మదాబాద్, రాయ్ పూర్, వడోదర, సూరత్, నోయిడా, ఢిల్లీలోని వినియోగదారులకు మరింత చేరువ చేస్తూ, 'హర్ దిన్ మంగళమై' సంకల్పాన్ని సాకారం చేస్తుందని తెలిపారు.




# పేట కలెక్టరేట్ లో ఘనంగా మహర్షి భగీరథ జయంతి వేడుకలు

నారాయణపేట జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23 (ప్రజా దర్బార్): నారాయణ పేట జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహర్షి భగీరథ జ యంతి వేడుకలకు స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహర్షి భగీరథ చిత్ర పటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫణీం ద్ర రెడ్డి మాట్లాడుతూ... భగీరథ మహర్షి ఒక గొప్ప తపస్వి అని అన్నారు.

వారు చేసిన తపస్సును ప్రసన్నమై శివ పరమాత్ముడు గంగాదేవిని భూమికి పంపించాడనీ, అందుకే మనము గంగా నదిని భగీరథి అని కూడా పిలుస్తామని తెలిపారు. భగీరథ మహర్షి గంగానదిని భూమికి తీసుకువచ్చి మానవాళి పాపాలను పోగొట్టేందుకు చేసిన కఠోర తపస్సు భారతీయ సంస్కృతిలో విశిష్ట స్థానాన్ని కలిగి ఉందని తెలిపారు. ఆయన చూపిన దీక్ష, సంకల్పం, నిస్వార్థ సేవా భావం నేటికీ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజంలో ఉన్న అసమానతలు, అన్యాయాలను తొలగించేందుకు భగీరథ మహర్షి అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఉందని ఆమె పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత ఆయన జీవితం నుండి స్ఫూర్తి పొందాలని సూచించారు. ఆ మహాపురుషుని జయంతి సందర్భంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నందుకు ఎంతో సంతోషమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రజలందరికీ భగీరథ మహర్షి జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో కలెక్టరేట్ ఏ వో శ్రీధర్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, డీపీ అర్ వో ఎం.ఏ. రషీద్, సగర సంఘం జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు సాగర్, ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, పట్టణ అధ్యక్షు డు విజయ్ సాగర్, సంఘం సభ్యులు ఆంజ నేయులు, నరేందర్, వెంకటేష్, మన్నే లక్ష్మణ్, హన్మంతు, రవి, రాంపూర్ హన్మంతు, ప్రజాప్రతిని ధులు, బి . సి సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలలు ప్రజల సమిష్టి ఆస్తి

## - ప్రజల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి- పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలి-రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఈర్ల సమ్మయ్య



కాల్వశ్రీరాంపూర్,ఏప్రిల్ 23(ప్రజాదర్బార్):ప్రభుత్వ పాఠశాలలు ప్రజల సమిష్టి ఆస్తి అని,ప్రజల సహకారంతోనే అవి అభివృద్ధి చెందుతాయని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత,ఊషన్నపల్లి ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య అన్నారు.గురువారం చివరి పని దినాన్ని పురస్కరించుకొని పాఠశాలలో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పిటిఎం) ను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పాఠశాల పిల్లలకు తల్లిదండ్రులు,గ్రామస్తుల సమక్షంలో ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. రాష్ట్రస్థాయి తెలుగు పద్యాల పోటీల్లో గెలుపొందిన పొన్నాల శ్రీనిధి,తోట ఆరూహిలకు,గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి సీటు పొందిన తోట ఆరాధ్య, తోట ఆరూహి,బండారి స్వేచ్ఛ,చీర రుతిక, రితికలకు ప్రత్యేక ప్రశంసా పత్రాలను అందజేశారు. పాఠశాలకు ఎక్కువ రోజులు హాజరైన వారు,వివిధ అంశాల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు కూడా ప్రశంసా పత్రాలను అందజేసి, అభినందించారు.ఈ సందర్భంగా ఈర్ల సమ్మయ్య మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరంలో 10 కంప్యూటర్లతో పిల్లలకు కంప్యూటర్ విద్యను అందిస్తామని,లక్షా ఏడు వేల రూపాయల విలువైన ఇంటరాక్టివ్ పానెల్ (స్మార్ట్ టీవీ) ద్వారా తరగతుల్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. స్మైల్ ఫౌండేషన్ ద్వారా పాఠశాలలో రూ.7 లక్షల విలువైన సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తున్నామని,పిల్లల సౌకర్యం కోసం ప్రతి తరగతి గదిలో ఏసీలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. భద్రత,రక్షణ కోసం పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఈర్ల సమ్మయ్య తెలిపారు.పాఠశాలలో విద్యాపరమైన సేవలు అందించిన గోపిశెట్టి సుప్రియ,బండారి సరితలను ఆయన శాలువాతో ఘనంగా సన్మానించారు.వారి సేవలను కొనియాడారు.కార్యక్రమంలో పాఠశాల చైర్పర్సన్ పెండ్లి స్వరూప,ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య,ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు అమృత సురేష్ కుమార్,మంద శ్రీవాణి,ఎడ్ల స్రవంతి,గోపిశెట్టి సుప్రియ,బండారి సరిత,పిల్లల తల్లిదండ్రులు, విద్యార్థినీ, విద్యార్థులు,పలువురు పాల్గొన్నారు.

# ఈ నెల 30న నాగర్ కర్నూల్ లో ఉచిత కంటి ఆపరేషన్ చికిత్స శిబిరం

నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 23 (ప్రజాదర్బార్) నాగర్ కర్నూల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ,జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ వారి ఆధ్వర్యంలో ఈనెల 30న గురువారం నాడు ఉదయం 9నుండి 11గంటల వరకు ఉచిత కంటి చికిత్స శిబిరము నిర్వహిస్తున్నట్లు నాగర్ కర్నూలు ఆప్తాలమిక్ అధికారి కొత్త బాలాజీ తెలిపారు.నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ భవనం లోని గదినెంబర్ 102లో కంటిశిబిరం ఉదయం 9 నుండి 11గంటల వరకు వచ్చిన రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.శిబిరంలో రోగులకు ప్రత్యేక కంటి పరీక్షలు,సాధారణ పరీక్షలు నిర్వహించి, అందులో అవసరమైన వారికి,క్యాటరాక్టు పొర గలవారికి ఉచితంగా కంటిఆపరేషన్లు మహబూబ్ నగర్ ఏనుగొండ లయన్ రామ్ రెడ్డి కంటి ఆసుపత్రిలో నిర్వహించ నున్నట్లు తెలిపారు.రోగులకు ప్రత్యేక అంబులెన్స్ గొండకుపంపనున్నట్లుతెలిపారు. రోగులు ముందుగా బి.పి,షుగర్ పరీక్షలు చేసుకొన్నిరిపోర్టువెంట తెచ్చుకోవాలనితెలిపారు. ఈ ప్రాంత రోగులు ఆధార్ కార్డు,రేషన్ కార్డు,ఓటర్ కార్డు,ఏదేని గుర్తింపు కార్డు జిరాక్స్ కాపీ, ఫోన్ నెంబర్ ని తమవెంట తెచ్చు కోవాలని తెలిపారు. వివరాలకు 9440876556, 7386940480 లో సంప్రదించాలన్నారు.

# ఆర్టీసీ కార్మికులను వెంటనే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

## మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



వికారాబాద్ జిల్లాప్రతినిధి, ఏప్రిల్23(ప్రజాదర్బార్) ఆర్టీసీ కార్మికులను వెంటనే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మాజీ ఎమ్మెల్యే,బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మెతుకు ఆనంద్ అన్నారు.గురువారం వికారాబాద్ బస్ డిపో ఎదురుగ సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు వికారాబాద్ జిల్లా బీఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆర్టీసీ కార్మికుల సమ్మెకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని,కమిటీల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు.గతంలో కేసీఆర్ ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తే దానిని ఇప్పటిదాకా అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా డ్రైవర్ మరియు కండక్టర్ల మీద తీవ్రంగా ఒత్తిడి పెరిగిందని,కార్మికుల సమ్మెతో కాంట్రాక్ట్ డ్రైవర్లను తీసుకుని ప్రజల ప్రాణాలు గాలిలో దీపంలా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మార్చిందని మండిపడ్డారు.ఆంధ్రప్రదేశ్ లో ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని,మరి తెలంగాణలో ఎందుకు ఆలస్యం జరుగుతుందని ప్రశ్నించారు.ఆర్టీసీ సమ్మెతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని హామీ ఇచ్చి సమ్మె విరమింప చేయాలని కోరారు.ఆర్టీసీ కార్మికులకు సంఘీభావం తెలిపిన వికారాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ తో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులను అరెస్ట్ చేసి ధారూర్ పోలీస్ స్టేషన్ కు పోలీసులు తరలించారు.బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్ మరియు వికారాబాద్ నియోజకవర్గ బీఆర్ ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

నందిగామ ఏప్రిల్ 23 (ప్రజాదర్బార్):-రంగారెడ్డి జిల్లా నందిగామ మండల కేంద్రంలో ఎమ్మార్వో కార్యాలయంలో మండలంలోని మీసేవ నిర్వాహ కులతో తహసిల్దార్ సైదులు సమావేశమయ్యారు. భూమి కలిగిన ప్రతి రైతుకు సంబంధించిన భూ యాజమాన్య వివరాలు, వ్యక్తిగత సమాచారం ఆధారంగా ఫార్మర్ రిజిస్ట్రీ రూపొందించబడుతుందన్నారు. ప్రధానంగా పీఎం కిసాన్ పథకం, తదుపరి విడుదల లబ్ది పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరిగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని తెలిపారు. రాబోయే వ్యవసాయ సీజన్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ పథకాలు రైతు భరోసా, రుణమాఫీ, మొక్కజొన్న, పత్తి దాన్యం కొనుగోలు, యూరియా ఇతర ఎరువుల పంపిణీ ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అవుతుందన్నారు. రైతులు తమ ఆధార్ కార్డు, భూయాజమాన్యం పాసుబుక్కు ఆధార్ కు అనుసంధానమైన మొబైల్ నెంబర్ సమీపంలో ఉన్న వ్యవసాయ విస్తరణ అధికారి గాని లేదా మీసేవ కేంద్రాలను సంప్రదించి వెంటనే ఫార్మర్ ఐడి నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈనెల ఏప్రిల్ 22 వ తేదీ నుంచి 30 వ తేదీ వరకు మండలంలో ప్రత్యేక డ్రైవ్ ఉంటుందని ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.



# రోడ్డుకు అడ్డంగా కందకం- ఆందోళనలో రైతులు



హసన్ పర్తి ప్రజాదర్బార్ ఏప్రిల్ 23: హసన్ పర్తి మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 84 లో జబ్బుకుంట కట్టకు వెళ్లే రైతుల బండ్ల బాటకు అడ్డంగా రాజకీయ పలుకుబడి ఉన్న ఓ నాయకుడు కందకం తవ్వాడు. దీంతో ఆ దారి గూండా నిత్యం వెళ్లే రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు.పూర్వం నుండి చిన్న వెంకట నరసయ్య బండ పక్కన నుండి జబ్బుకుంట కట్టకు వెళ్లేందుకు దారి ఉంది.ఈ దారి చివర సదరు వ్యక్తి ఓ వెంచర్ ను ఏర్పాటు చేశాడని,ఈ బాటను కూడా కబ్జా చేసుకునేందుకు కందకం తీసినట్లు బాధిత రైతులు ఆరోపిస్తున్నారు.గతంలో కూడా ఈ రాజకీయ నాయకుడే ఇదే ప్రాంతంలో బాటకు అడ్డంగా కందకం తవ్వగా ఈ ప్రాంత రైతులు ప్రభుత్వ అధికారులకు పిర్యాదు చేయగా, అప్పటి అధికారులు వచ్చి సదరు రాజకీయ నాయకున్ని మందలించి కందకాన్ని పూడ్చి రైతులకు సమస్య లేకుండా చేశారు.మళ్ళీ ఇప్పుడు ఆ రాజకీయ నాయకుడే కందకం తీసి రైతులకు ఇబ్బంది కల్గిస్తున్నాడని రైతులు ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి రహదారిని కాపాడాలని రైతులు కోరుతున్నారు.

# మహిళల భద్రత సామాజిక బాధ్యత

## - పరిశోధనాంశాలను వివరించిన సైకాలజీ అధ్యాపకురాలు డాక్టర్ అఫ్రిన్ వసీం



పటాన్ చెరు, ఏప్రిల్ 23, (ప్రజాదర్బార్): మహిళలు భయం లేకుండా స్వేచ్ఛగా జీవించగల వాతావరణాన్ని సృష్టించడానికి సామూహికంగా బాధ్యత వహించాలని గీతంలోని అప్లైడ్ సైకాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అఫ్రీన్ వసీం అభిప్రాయపడ్డారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్) 'పరిశోధన చర్చలు' శ్రేణిలో భాగంగా ఐదవ సెమినార్ ను గురువారం నిర్వహించింది. 'భయంలో జీవించడం: భారతదేశంలోని మహిళలపై లైంగిక హింస ముప్పు యొక్క మానసిక ప్రభావం' అనే శీర్షికతో జరిగిన ఈ ఉపన్యాసం, లైంగిక హింస యొక్క నిరంతర ముప్పు కారణంగా మహిళలు మోస్తున్న, విస్తృతంగా వ్యాపించి ఉన్న, తరచుగా విస్మరించబడే మానసిక భారాన్ని పరిశీలించింది. ఈ భయం వారి మానసిక ఆరోగ్యాన్ని, ప్రవర్తనను, రోజువారీ నిర్ణయాలను ఎలా ప్రభావితం చేస్తుందో డాక్టర్ వసీం వివరించారు. అంతర్జాతీయంగా ఖ్యాతి గడించిన 'అనాలిసిస్ ఆఫ్ సోషల్ ఇష్యూస్ అండ్ పబ్లిక్ పాలసీ' (వైలీ) జర్నల్ లో ప్రచురితమైన ఆమె పరిశోధన, అందులోని ప్రధాన అంశాలను డాక్టర్ వసీం వివరించారు. అనుభవపూర్వక పరిశోధనల ఆధారంగా, సమాజంలో లోతుగా పాతుకుపోయిన, ఈ సవాళ్లను పరిష్కరించడానికి మరింత అవగాహన, విధానపరమైన జోక్యం, బలమైన సహాయక వ్యవస్థల ఆవశ్యకతను ఆమె నొక్కి చెప్పారు.'భయం యొక్క పటం'గా వర్ణించిన ఆరు కీలక అంశాలను డాక్టర్ వసీం సమర్పించారు. బహిరంగ ప్రదేశాలలో నిరంతర అతి జాగరూకత, మారిన జీవన విధానాలు–పరిమితమైన చలనశీలత, మహిళలు అవలంబించే సర్దుబాటు పద్ధతులు, ఆందోళన–భావోద్వేగ అలసట వంటి మానసిక ప్రభావాలు, రక్షణ పేరుతో కుటుంబం విధించే ఆంక్షలు, వ్యవస్థాగత మార్పు కోసం పెరుగుతున్న డిమాండ్లతో పాటు శారీరక హింస లేకపోయినా, భయమే నిజమైన హానిని కలిగించగలదని ఆమె అభిప్రాయపడ్డారు. అర్థవంతమైన సంస్కరణల కోసం పిలుపునిస్తూ, సకాలంలో న్యాయం, బలమైన చట్ట అమలు, సహాయక కుటుంబ వాతావరణం, బాధితులను నిందించే వైఖరులను సవాలు చేసే సాంస్కృతిక మార్పు యొక్క ఆవశ్యకతను డాక్టర్ వసీం నొక్కి చెప్పారు. న్యాయమైన సమాజానికి మహిళల భద్రతను నిర్ధారించడం ప్రాథమికమని స్పష్టీకరిస్తూ, ఆమె తన ఉపన్యాసాన్ని ముగించారు. జీఎస్ హెచ్ఎస్ సంస్థాగత పరిశోధన కమిటీ నిర్వహించిన ఈ చర్చాగోష్ఠిలో అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ ను కలిసిన ఆర్ టి యు తెలంగాణ నాయకులు..



ప్రజాదర్బార్ ఆదిలాబాద్ ప్రతినిధి ఏప్రిల్ 23: తెలంగాణ ఉపాధ్యాయ సంఘం ఆదిలాబాద్ జిల్లా శాఖ పక్షాన గురువారం ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సెన్సెస్ శిక్షణ సమయంలో మార్పులు చేయాలని కోరుతూ కలెక్టర్ కు విన్నవించారు. ఉపాధ్యాయులకు ఇబ్బందులు కలగకుండా శిక్షణ సమయాన్ని సర్దుబాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ ఉపాధ్యాయుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని శిక్షణ సమయాన్ని మార్చడానికి తప్పకుండా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ఇందులో జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ యాదవ్, జిల్లా కోశాధికారి ముజీబ్, రాష్ట్ర గౌరవ అసోసియేట్ అధ్యక్షుడు కనక అభిమాన్,తదితరులు ఉన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కలెక్టర్ ఇచ్చిన హామీ పట్ల సంఘం జిల్లా శాఖ హర్షం వ్యక్తం చేశారు.

# పరిగిలో భారత్ బంద్‌కు మద్దతుగా ధర్నా



పరిగి ఏప్రిల్ 23(ప్రజాధర్బార్ ) భారత్ బంద్‌లో భాగంగా పరిగి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద భారత్ ముక్తి మోర్చా, ఓబీసీ మోర్చా మరియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చెప్పటారు . పరిగి బస్టాండ్ ఎదుట జరిగిన ఈ ధర్నా కార్యక్రమం లో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద్ నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జనగణనలో ఓబీసీ కులాలను తప్పనిసరిగా చేర్చాలని డిమాండ్ చేశారు. 1931 తర్వాత ఓబీసీ కులగణన జరగకపోవడం చాలా బాధాకరమని పార్లమెంట్‌లో తీర్మానం చేసినప్పటికీ అమలు చేయకపోవడం బీసీలపై నిర్లక్ష్యంగా వ్యవహరించడమేనని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థుల రక్షణ కోసం తీసుకొచ్చిన యుజిసి ఈక్విటీ చట్టం 2026 ను కఠినంగా అమలు చేయాలని కోరారు. యూనివర్సిటీలలో కులవివక్షతో ర్యాగింగ్, అన్యాయాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే 2011కు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికుల హక్కులు పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు వెంకటయ్య, ఎండి హబీబ్, సత్తయ్య, పీర్ మమ్మద్, భారత్ ముక్తి మోర్చా నాయకులు శంకర్, వీరేందర్ నాయక్, ఓబీసీ మోర్చా నాయకుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచే విద్యార్థులకు ప్రారంభమైన వేసవి సెలవులు: పునః ప్రారంభం జూన్ 12

దోమకొండఏప్రిల్ 23 , (ప్రజాదర్బార్ ) కా మా రెడ్డి జిల్లా దోమకొండ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు ఈనెల 24వ తేదీ శుక్రవారం నుండి వేసవి సెలవులు ప్రారంభమై నాయి. 12 జూన్ 2026న పునః ప్రారంభం అవుతాయి. అన్ని తరగ తులకు వార్షిక పరీక్షలు ముగియడంతో ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న పరీక్షల ఫలితాలను గురువారం వెల్లడించి ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు ప్రగతి పత్రాలను అందజేశారు. దీనితో విద్యార్థుల ముఖాలలో ఆనందానికి అవధులు లేవు. మండల విద్యాశాఖ అధికారి విజయ్ కుమార్ మాట్లాడుతూ: ప్రభుత్వ ఆదేశాల మేరకు వేసవి సెలవులలో ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలలు కూడా మూసి ఉంచాలని మండల విద్యాశాఖ అధికారి సూచించారు.



# జగిత్యాలలో అకాల వర్షం ఎండల మధ్య ఉపశమనం

జగిత్యాల, ఏప్రిల్ 23,(ప్రజాదర్బార్) జగిత్యాల జిల్లాలో గురువారం సాయంకాలం ఆకస్మికంగా వాతావరణం మారి అకాల వర్షం కురిసింది. ఉదయం నుండి మండుతున్న ఎండలతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, సాయంత్రం సమయంలో ఒక్కసారిగా మేఘాలు కమ్ముకుని వర్షం కురవడం అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. గురువారం రోజున ఉదయం నుండి భారీ ఎండలతో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదయ్యాయి.ంతులకు పంట చేతుకు అంది వచ్చే సమయంలోఅయితే సాయంత్రం సమయంలో వాతావరణంలో మార్పు చోటుచేసుకుని మేఘాలు దట్టంగా కమ్ముకుని, కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షం కురిసింది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, సాయంత్రం సమయంలో స్వల్పంగా వర్షం పడే అవకాశం ఉన్నట్లు ముందుగానే సూచనలు ఉన్నాయి.

ఈ వర్షంతో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు తగ్గి, వేడి తీవ్రత నుంచి ప్రజలకు ఉపశమనం లభించింది. రోడ్లపై వెళ్లే ప్రజలు, వ్యాపారులు వాన జల్లు లతో సంతోషం వ్యక్తం చేశారు కానీ రైతులకు పంట చేతుకు అంది వచ్చే సమయంలో వర్షం పడటం వల్ల నష్టం వాటిల్లే అవకాశం ఉంది. అయితే అకాల వర్షం కారణంగా కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం,

రహదారులపై నీరు నిల్వ ఉండడం వంటి సమస్యలు కూడా తలెత్తినట్లు సమాచారం. సాయంత్రం సమయంలో వర్షం కురవడంతో ట్రాఫిక్ కూడా కొంతసేపు ప్రభావితమైంది. ఉదయం నుండి మండుతున్న ఎండలతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, సాయంత్రం సమయంలో ఒక్కసారిగా మేఘాలు కమ్ముకుని మొత్తంగా, ఎండల తీవ్రత మధ్య కురిసిన ఈ అకాల వర్షం ప్రజలకు తాత్కాలిక ఉపశమనం ఇచ్చినప్పటికీ, వాతావరణంలో అకస్మాత్తుగా మార్పులు కొనసాగవచ్చని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో
# రాష్ట్ర హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం..

## -మాజీ సీఎం కేసీఆర్ పై విమర్శలు మానుకోవాలి..-మాజీ మంత్రి జోగు రామన్న..



ప్రజాదర్బార్ ఆదిలాబాద్ ప్రతినిధి ఏప్రిల్ 23: కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలిపారు. స్థానిక ఎతీం పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండించారు. ఈమేరకు మాజీమంత్రి జోగురామన్న మాట్లాడుతూ... జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు స్పష్టంగా ఆదేశించడం, న్యాయవ్యవస్థపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని మరింత బలపరిచిందని అన్నారు. కమిషన్ నిబంధనలు పాటించలేదని కోర్టు పేర్కొనడం ద్వారా నిజం వెలుగులోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ ప్రతీకార ధోరణితో వ్యవహరిస్తూ, బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు ఆరోపణలు మోపుతోందని విమర్శించారు. న్యాయం ఎప్పటికైనా గెలుస్తుందని, ప్రస్తుతం హై కోర్ట్ ఇచ్చిన తీర్పు అందుకు నిదర్శనమని చెప్పారు. కాళేశ్వరం వంటి ప్రాజెక్టును దూషించడం, మాజీ సీ.ఎం కేసీఆర్ పై అనవసర విమర్శలు చేయడం మానుకుని రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యలను పక్కన పెట్టి రాజకీయ వేధింపులు చేయడం తగదని హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ ప్రజల పక్షాన నిలబడి, నిజం కోసం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. పట్టణ అధ్యక్షులు అజయ్,వెనగంటి ప్రకాష్, కేమ శ్రీకాంత్,మొట్టే కిరణ్, ఛందల రాజన్న,దాసరి రమేష్,కొండ గణేష్,దమ్మాపాల్, సలీమ్,,దివిటి రాజు,మహేష్ కలిమ్,, తదితరులు పాల్గొన్నారు..

# ఆర్టీసీ కార్మికుల సమ్మెకు ధర్మసమాజ్ పార్టీ మద్దతు



వికారాబాద్ జిల్లాప్రతినిధి, ఏప్రిల్23(ప్రజాదర్బార్) ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ధర్మ సమాజ పార్టీ జిల్లా అధ్యక్షులు రవీందర్ మహారాజ్,బీసీ ఎస్సి ఎస్టీ జేఏసీ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. గురువారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భం గా ఇరువురు మాట్లాడుతూ....తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె పై ధర్మ సమాజ్ పార్టీ, బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసి తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోందన్నారు. ఈ సమ్మెలో పాల్గొంటున్న ఉద్యోగులు మాత్రమే కాకుండా, ఆర్టీసీ సేవలను వినియోగించే ప్రయాణికులలో కూడా మెజారిటీ బీసీ ఎస్సి ఎస్టీ వర్గాలే ఉన్నారని వారు అన్నారు. సమస్యను తక్షణమే పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని స్పష్టం చేస్తూ, ప్రభుత్వం ఆర్ టిసి కార్మికుల న్యాయపరమైన రాజ్యాంగబద్ధ డిమాండ్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు.సమ్మె దీర్ఘకాలం కొనసాగితే ప్రజలకు మాత్రమే కాకుండా ప్రభుత్వానికి కూడా తీవ్రమైన నష్టం కలుగుతుందని హెచ్చరించారు. అందువల్ల ప్రభుత్వం ఆలస్యం చేయకుండా వెంటనే చర్చలకు ఉపక్రమించి, కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను అంగీకరించాలని కోరారు.ఆర్టీసీ సంస్థను బలోపేతం చేసే విధంగా ప్రభుత్వంలో విలీనం చేసే అంశాన్ని పరిగణించాలని,పెండింగ్ వేతనాలు, పీఆర్సీ, భత్యాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ రెగ్యులరైజేషన్ చేపట్టాలని కోరారు.ప్రైవేటీకరణ చర్యలను పూర్తిగా నిలిపివేయాలని డిమాండ్ చేశారు.అనంతరం ఆ పార్టీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి ధారూర్ పోలీస్ స్టేషన్ కి తరలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నవీన్ రాథోడ్, వెంకటేష్ మల్లికార్జున్, వెంకటేష్ మల్లేష్, సత్తయ్య, రాజు మరియు వివిధ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నడం జరిగింది.

# మాడుగులపల్లి మండలంలో ఘనంగా పోషణ పక్వాడా ప్రోగ్రామ్

మాడుగులపల్లి( ప్రజాదర్బార్ ) ఏప్రిల్ 23 :దామరచర్ల ప్రాజెక్టు మాడుగుల పల్లి మండలం ఘనంగా పోషణ పక్వాడా ప్రోగ్రామ్స్ జరిగాయి చిన్నారులు టీచర్స్ తో కలిసి మెడిటేషన్ చేశారు మండల్ లెవెల్ పోషణ పక్వాడా ప్రోగ్రాం లో భాగంగా మాడుగులపల్లి మండల సర్పంచ్ అరూరి నరేష్ మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్ ఆయా కలిసి పిల్లల ఆలనా పాలనా చూస్తూ అమ్మలాంటి ప్రేమను పంచుతూ పిల్లల శారీరక మానసిక సాంఘిక అభివృద్ధికి తోడ్పడుతున్నారు ఇలాగే మీ సేవలు అందించాలి అని అన్నారు .సి డి పి ఓ చంద్రకళ మాట్లాడుతూ ఈనెల 9నుండి 23 వరకు పోషణ పక్వాడ ప్రోగ్రామ్స్ విజయవంతంగా చేయడం జరిగింది అని చైల్డ్ మ్యారేజ్ జరగకుండా చైల్డ్ మ్యారేజ్ లేని గ్రామం మండలం గా అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని ఎస్ ఐ కృష్ణయ్య మాట్లాడుతూ చైల్డ్ మ్యారేజ్ జరగకుండా మేము కూడా సపోర్టు ఉంటామని హామీ ఇచ్చారు తదన అనంతరం శ్రీమంతాలు అక్షరాభ్యాసం ప్రీ స్కూల్ అసెస్మెంట్ కార్డ్స్ చిన్నారులకు అందజేయడం జరిగింది ఈ ప్రోగ్రాం కి అంగన్వాడి సూపర్వైజర్ జి లక్ష్మి నాగమణి మాడుగుల పల్లి గ్రామ కార్యదర్శి షేక్ ఖాసిం సీసీ డి టి రమణి అంగన్వాడీ టీచర్స్ తల్లులు అంగన్వాడిచిన్నారులు కిషోర్ బాలికలు పాటిస్పేట్ చేయడం జరిగింది.



# పంగిడిమదరాలో ఉచిత టీబీ పరీక్ష శిబిరం



తిర్యాణి, ప్రజా దర్బార్ ఏప్రిల్ 23రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా తిర్యాణి మండలంలోని గిన్నెదరి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని పంగిడిమదరా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో గురువారం ఉచిత టీబీ ఎక్స్రే శిబిరం నిర్వహించారు. గ్రామస్తుల ఊపిరితిత్తుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు హ్యాండ్ హోల్డ్ ఎక్స్రే యంత్రంతో పరీక్షలు చేపట్టినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. టీబీ వ్యాధి వ్యక్తి నుండి వ్యక్తికి సోకే అంటువ్యాధి అని, రెండు వారాలకు పైగా దగ్గు, రాత్రిపూట చెమటలు, జ్వరం, ఆకలి మందగడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఎక్స్రే, తెమడ పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు. ఆరు నెలలపాటు క్రమం తప్పకుండా మందులు వాడితే టీబీ పూర్తిగా నయమవుతుందని వారు స్పష్టం చేశారు. మారుమూల గ్రామంలోనే శిబిరం నిర్వహించడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్లు తురం గోపాల్, ఆత్రం రాధాబాయి, ఆత్రం రాదా, కోవా దేవేంద్ర బాయి, మడావి కమలబాయి, ఆరోగ్య కేంద్ర సిబ్బంది (ఎం ఓ/డి డి ఓ) డాక్టర్ అక్షిత్, హెచ్ వి ప్రమీల, హెచ్ ఈ ఓ రమేష్, ఎం ఎల్ హెచ్ పి లతాశ్రీ, ఏ ఎన్ ఎం సంతోషి, పీఎం జన్మన్ సిబ్బంది వెంకటమ్మ, ఆశావర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు సురేష్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# పుట్ట మధుకర్ మాటలను ఖండించిన కాంగ్రెస్ నాయకులు

కాటారం ఏప్రిల్ 23 ( ప్రజా దర్బార్) సీఎం రేవంత్ రెడ్డి సభ భారీ స్థాయిలో విజయవంతం కావడంపై పుట్ట మధు, చల్ల నారాయణరెడ్డిలు సీఎం రేవంత్ రెడ్డి, అభివృద్ధి ప్రదాత శ్రీధర్ బాబులపై అనత్య ఆరోపణలు, అమర్యాద మాటలు మాట్లాడుతున్నారని కాటారం కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ బిఆర్ ఎస్ నాయకులు చేసిన వాక్యాలను తీవ్రంగా ఖండించారు. పరిపాలన చేతకాక ప్రజలు ప్రతిపక్షంలో కూర్చోబెడితే, అది చేతకాని కెసిఆర్ ,పుట్ట మధు నారాయణ రెడ్డిలు అధికార కాంగ్రెస్ పై అర్థరహిత ఆరోపణలు చేస్తూ ,అబాసు పాలవుతున్నారని పేర్కొన్నారు .అభివృద్ధి ధ్యేయంగా కోట్లాది రూపాయల నిధులతో రైతు, మహిళా, విద్యార్థి ,ఉద్యోగ ఉపాధ్యాయ, సంక్షేమ ధ్యేయంగా కొనసాగుతున్న రేవంత్ రెడ్డి ప్రజా పాలన ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటని అన్నారు. పుట్ట మధు వైఖరి మార్చుకోకపోతే ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. వరుసగా మంథని ప్రజలు ఆశీర్వదిస్తుంటే ఓర్వలేని పుట్ట మధు రాజకీయ సన్యాసం పుచ్చుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# హైకోర్టు తీర్పుతో కాంగ్రెస్ డ్రామాలు బహిర్గతం
## - రేవంత్ సర్కార్ పై బిఆర్ఎస్ నేతల తీవ్ర విమర్శలు




జైనూర్,ప్రజాదర్బార్ న్యూస్,ఏప్రిల్ 23: ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆదేశాల మేరకు గురువారం జైనూర్ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో బిఆర్ ఎస్ నాయకులు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. హైకోర్టు తీర్పుతో కాంగ్రెస్ ప్రభుత్వపు “డ్రామాలు” బట్టబయల య్యాయని వారు వ్యాఖ్యానించారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ పేరుతో రేవంత్ రెడ్డి సర్కార్ పచ్చి రాజకీయ నాటకమే ఆడిందని నాయకులు ఆరోపించారు. ఇది స్వతంత్ర కమిషన్ నివేదిక కాదని, కాంగ్రెస్ పార్టీ రూపొందించిన పిసిసి స్క్రిప్ట్ మాత్రమేనని, హైకోర్టు తీర్పు ద్వారా అది స్పష్టమైందని తెలిపారు. సహజ న్యాయ సూత్రాలను పక్కనబెట్టి రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కెసిఆర్,మాజీ మంత్రి హరీష్ రావులను లక్ష్యంగా చేసుకుని రాజకీయంగా దెబ్బ తీయాలని ప్రభుత్వం ప్రయత్నించిందని విమర్శించారు. ఈ నేపథ్యంలో హైకోర్టు తీర్పు రేవంత్ సర్కార్‌కు గట్టి చెంపపెట్టుగా మారిందని హెచ్చరించారు.రైతుల సమస్యలను పట్టించుకోకుండా,ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వం ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకుని,రాష్ట్ర రైతాంగానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇకపై కెసిఆర్,హరీష్ రావులపై దుష్ప్రచారం చేస్తే సహించబోమని, ప్రజా క్షేత్రం లో తగిన బుద్ధి చెబుతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు ఇంతియాజ్ లాల,జైనూర్ సర్పంచ్ కొడప ప్రకాష్, జైనూర్ సహకార సంఘం మాజీ చైర్మన్ హన్నుపటేల్,మాజీ సర్పంచ్ల అధ్యక్షులు మడవి భీంరావ్,శివనూర్ సర్పంచ్ శ్రావణ్,కుమ్ర కేశవ్, నాయకులు మెస్రం రాహుల్, ముండే సతీష్,మెస్రం నాగురావ్,జావీద్, ఉపసర్పంచ్ అజీమ్ కినక రాంశావ్,బలరాం నాయక్, పుండ్లిక్, సుదర్శన్,జ్యోతి రామ్,గేడం నరహరి,ప్రభు దేవరావ్, మనోహర్,జాదవ్ మోహన్,షకీల్,అబ్జల్ ఖాన్, అసద్, బీర్ షావ్, భాస్కర్, గోవింద్ రావ్,బాదిరావ్, సయ్యద్ ఆఫ్ఘాన్, ఇమ్రాన్, జూగాది,గంగు,దిలీప్,బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించండి --తహసీల్దార్ నీతూ




మెట్పల్లి రూరల్ ఏప్రిల్ 23 (ప్రజా దర్బార్) జగిత్యాల జిల్లా మెట్పల్లి మండలం వెల్లుల్ల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో జరిగిన పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో ముఖ్య అతిథిగా మెట్పల్లి మండల తహసిల్దార్ నీతూ పాల్గొన్నారు ఈ సందర్భంగా తహసిల్దార్ నీతూ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చక్కటి సౌకర్యాలు, మంచి పరిజ్ఞానం, అనుభవం ఉన్న ఉపాధ్యాయులు ఉన్నారని కావున మీ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు పొందాలని తెలిపారు. 2025-2026 విద్యా సంవత్సరంలో 6 నుండి 9 వ తరగతి చదివిన విద్యార్థులకు “ప్రగతి పత్రాలు” తల్లిదండ్రుల సమక్షంలో అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గూడూరు తిరుపతి, ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి,ఉపాధ్యాయులు రాజారామ్, రజిత, చంద్రయ్య, స్కైలాబ్, సత్యనారాయణ, సురేఖలు మండల రెవిన్యూ అధికారి ఉమేష్ గ్రామ పరిపాలన అధికారి నాగరాణి పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం మరియు పాఠశాల వార్షికోత్సవము.



మల్దకల్ ఏప్రిల్ 23( ప్రజా దర్బార్):జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అమరవాయి, మల్దకల్ మండలం లో బుధవారం నాడు పదవ తరగతి విద్యా ర్థులకు వీడ్కోలు సమావేశం మరియు పాఠశాల యొక్క వార్షికోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్ర మం లో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు గడచిన అయిదు సంవ త్సరాల జ్ఞాపకాలు, ఉపాధ్యాయుల తో ఉన్న అనుబం ధాలను పంచుకోవడం జరిగింది.పదవ తరగతి తరువా త వారి భవిష్యత్తుకు ఉపయోగపడేలా తగు సలహాలు, సూచనలు చేయడం జరిగింది. అలాగే భవిష్యత్తు ప్ర ణాళికను నిర్ణయించుకోవాలి , ఉన్నతంగా ఎలా జీవిం చాలి అనే విషయాల పైన అవగాహన కల్పించడం జరిగింది. పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా ఈ విద్యా సంవత్సరం మొత్తంలో పాఠశాలలో జరిగిన కార్యక్రమాలను, విద్యార్థుల ప్రగతిని, సాధించిన విజయాలను స్క్రీన్ ద్వారా తల్లి తండ్రులకు చూపించడం జరిగింది.పాఠశాల విద్యార్థులు రకరకాల సాంస్కృతిక కార్యక్రమాలు నృత్యాలు, నాటక ప్రదర్శ నలు ,పాటలతో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అమరవాయి గ్రా మం సర్పంచ్ తూమ్ కృష్ణా రెడ్డి , మాజీ ఎంపీటీసీ గోపాల్ రెడ్డి, వెంకట్రామమ్మ వెంకట్రామయ్య గార్ల ట్రస్టు సభ్యులు మురళీధర్ రెడ్డి,ఉపాధ్యాయ బృందం విష్ణు, సుమలత ,అక్షితుడు , అనిత,ఋషిరాజు , రవి, ధనుంజయ, ఆనంద్ కుమార్, సరిత ,అరుణ, ఈరన్న, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# మద్దులపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ :



కాళేశ్వరం, ఏప్రిల్ 23, ప్రజాదర్బార్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం రోజున విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ సరిత హాజరై విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయులు--తల్లిదండ్రుల సమావేశంలో వేసవి సెలవుల సమయంలో పిల్లలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరించారు. ఇటీవల గురుకుల పరీక్షలు రాసిన విద్యార్థులకు సీట్లు రావడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో వారు ఉన్నత స్థాయిలు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సదయ్య, కరిష్మా, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గోడిశాల రామనాధం జిల్లా ఉపాధ్యక్షులు కావడం పట్ల హర్షం

పినపాక, ఏప్రిల్ 23, ప్రజాదర్బార్: ఎన్నో సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ పినపాక కాంగ్రెస్ మండల అధ్యక్షులు గోడిశాల రామనాథం అధిష్టాన నిర్ణయం మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నిక కావడం పట్ల పినపాక సర్పంచ్ అలివేలు, కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ వ్యక్తికి ప్రతిక్షణం అందుబాటులో ఉంటుందని, దానికి నిదర్శనమే గోడిశాల రామనాధానికి ఉపాధ్యక్ష పదవి ఇవ్వటమని తెలిపారు. తనకు జిల్లా ఉపాధ్యక్షులు ఇవ్వడం పట్ల సహకరించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకి, రెవిన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి, అటవీ అభివృద్ధి శాఖ చైర్మన్ పోదేం వీరయ్యకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. తన కష్టాన్ని పార్టీ గుర్తించిందని, అందుకే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నిక చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో సర్పంచ్ అరిగెల అలివేలు, ఉప సర్పంచ్ బోడ తిరపతయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల స్వతంత్ర రెడ్డి, కొంపెల్లి నగేష్, సోంబోయిన ప్రసాద్, కొండేరు సంపత్, మార్త మనోజ్, బాలసాని నరసింహులు, వరప్రసాద్, కోన శీను, పాల్గొన్నారు.



## విబి గ్రామ్ జీ బిల్లు రాజ్యాంగ వ్యతిరేక చట్టమే

# పాత చట్టాన్నే కొనసాగించాలి!.

హసన్‌పర్తి ప్రజాదర్బార్ ఏప్రిల్ 23: కేంద్రం తీసుకు వస్తున్న విబి గ్రామ్ జీ బిల్లు 2025 భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా తీసుకువచ్చిన చట్టమేనని,కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటినుండి ఉపాధి చట్టాన్ని అడుగడున ఉల్లంఘిస్తూ కూలీల హక్కులను కాలరాస్తుందని,పాత పద్దతిలో ఉపాధి హామీ పనిని కొనసాగించాలని, విబి గ్రామ్ జీ చట్టాన్ని కూలీలు సంఘటితమై తిరస్కరించాలని,రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కూలీల పక్షాన నిలబడి విబి గ్రామ్ జీ బిల్లుకు నిరసనగా కేంద్ర ప్రభుత్వ మెడలు వంచాలని, నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ ను పూర్తిగా రద్దు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్)రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హసన్‌పర్తి మండలం జయగిరి గ్రామంలోని పాత చెరువులో పూడిక తీత పనులు చేస్తున్న కూలీలతో పనివద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ మాట్లాడుతూ కూలీలకు గత మూడు నెలలుగా పనిచేస్తున్న నేటికి వేతనాలు రాలేదని కూలీలు వాపోయరన్నారు. ఎండలు మండుతున్నందున పనుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. రాష్ట్ర గ్రామీణ




అభివృద్ధి శాఖ కమీషనర్ దివ్య దేవారాజన్ 14 వ ఫైనాన్స్ కమీషన్ సంబంధించి కూలీలకు పనుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని, ఓ ఆర్ ఎస్ ,ప్యాకెట్స్, మజ్జిగ, మంచినీరు అందించాలని గ్రామ పంచాయతి సర్పంచ్, కార్యదర్శులకు సర్క్యూలర్ జారి చేశారని దానిని అమలు చేయాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీలదేనని అన్నారు. బిజెపి సర్కారు కూలీల గొంతు నొక్కేందుకే కొత్త కొత్త విధానాలను తీసుకువస్తుం దని, విబి గ్రామ్ జీ చట్టాన్ని రద్దు చేసి కూలీల హక్కులను కాపాడాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత మనందరిపై ఉ ందన్నారు. కూలీలు పాత పద్దతిలో ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకుంటునే, కొత్తగా తెచ్చిన విబి గ్రామ్ జీ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని కూలీలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు,గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

## అమ్మ సన్నిధిలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,బట్టి విక్రమార్క లకు పాలాభిషేకం....

మధిర, ఏప్రిల్ 23 ప్రజా దర్బార్ ప్రతినిధి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని అధికారికంగా ప్రకటించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కి ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత గుప్తా కి మరి దీనికి సహకరించిన మీ అందరికీ కూడా కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. గురువారం మధిర పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం లో రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ..... ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని అధికారంగా ప్రకటించడం చాలా సంతోషదాయకమని అన్నారు. మునుముందు ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆర్థికంగా వెలగబడిన ప్రతి ఒక్కరికి సహాయాలు చూడాలని నాయకులు ప్రభుత్వాన్ని వేడుకున్నారు.శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం అర్చకులు శ్రీనివాసులు శేషాచార్యులు, వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం అధ్యక్షులు పల్ల పోతు ప్రసాదరావు,మధిర పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వంగవీటి రాజశేఖర్, మధిర మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చారు గుండ్ల నరసింహమూర్తి, మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మిరియాల వెంకటరమణ గుప్తా, మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రంగా హనుమంతరావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు దేవిశెట్టి రంగారావు, ఆర్యవైశ్య నాయకులు పుల్ల ఖండం సత్యనారాయణమూర్తి, కాజా చక్రధరరావు, చలువాది కృష్ణమూర్తి ఆర్టీసీ రిటైర్డ్, నేరెళ్ల శ్రీనివాసరావు, చేదె రామకోటేశ్వరరావు, వేముల నవీన్ కుమార్, వేముల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు

## "జనగణన 2027 స్వీయ-గణనకు సిద్ధం కావాలి తహసీల్దార్ తాడబోయిన వెంకటస్వామి పిలుపు"

పర్వతగిరి ప్రజాదర్బార్ ఏప్రిల్ 23: భారత జనాభా గణన--2027 కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న స్వీయ-గణన ప్రక్రియలో ప్రతి పౌరుడు చురుకుగా పాల్గొనాలని పర్వతగిరి మండల తహసీల్దార్ తడబోయిన వెంకటస్వామి పిలుపునిచ్చారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రజలు తమ ఇళ్ల నుంచే సులభంగా వివరాలను నమోదు చేసుకునే అవకాశం కల్పించబడిందని ఆయన తెలిపారు. స్వీయ-గణన కార్యక్రమం ఈ నెల 26 నుండి మే 10 వరకు కొనసాగుతుందని, ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెబ్‌సైట్ హెచ్టిటిపిఎస్://ఎస్.ఇ.సిఇఎన్ఎస్యుఎస్.గవ్.ఇన్ ద్వారా ప్రజలు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబానికి ప్రత్యేక ఎస్ ఈ ఐడీ ఇవ్వబడుతుందని, ఆ ఐడీ ద్వారా కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందని ఆయన వివరించారు. పేరు, వయస్సు, లింగం, విద్య, వృత్తి, నివాస వివరాలు వంటి కీలక సమాచారం సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ వివరాలు భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలు, సంక్షేమ పథకాల రూపకల్పనలో ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రజలు 15 రోజుల్లోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని, ఎలాంటి సందేహాలు ఉన్నా మండల కార్యాలయం లేదా స్థానిక అధికారులను సంప్రదించాలని తహసీల్దార్ సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని దేశ అభివృద్ధికి



తమ వంతు సహకారం అందించాలని ఆయన కోరారు. ప్రజల భాగస్వామ్యంతోనే జనగణన విజయవంతం అవుతుందని తహసీల్దార్ స్పష్టం చేశారు

## నర్సరీ, ఉపాధి పనులు పరిశీలించిన సర్పంచ్, ఉపసర్పంచ్లు

బూర్గంపహాడ్, ప్రజాదర్బార్ ఏప్రిల్ 23:మండల పరిధిలోని కృష్ణసాగర్ గ్రామపంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులతో పాటు నర్సరీని సర్పంచ్ తాటి వాణి, ఉపసర్పంచ్ మోహనరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి పనులు చేస్తున్న పనుల ప్రదేశం వద్దకు వెళ్లి కూలీలకు మంచినీటి క్యాన్లు, మెడికల్ కిట్లను అందజేశారు. పనుల ప్రదేశంలో వారికి ఎండ తగలకుండా టెండ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామంలో మొక్కల నర్సరీని సందర్శించి మొక్కలను సంరక్షించి పెంపకంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కృష్ణసాగర్ ఎస్టీ కాలనీలో ఎంపీపీఎస్ పాఠశాలను సందర్శించి పిల్లలకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని హెచ్ఎం కోటేశ్వరరావుకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగిరెడ్డి, పాలకవర్గ సభ్యులు ఉసిల్ల రాజేష్, అంతోటి కృష్ణలీల, బాదావత్ సురేష్, మడకం దేవయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ భూక్యా హనుమంతరావు, ఉ పాధ్యాయులు భీమయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల జ్ఞాపకార్థం కూలింగ్ వాటర్ ఫిల్టర్ అందజేత

మెట్పల్లి టౌన్ ఏప్రిల్ 23 (ప్రజా దర్బార్) మెట్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ప్రముఖ వ్యవసాయ మార్కెట్ వ్యాపారులు మహజన్ నరసింహులు తల్లిదండ్రులు మాహజన్ భూమయ్య గంగుబాయి స్మారకార్థం కార్యాలయంలో కూలింగ్ వాటర్ ఫిల్టర్ ను అందజేశారు. దానిని గురువారం రోజున వ్యవసాయ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ ప్రారంభించారు అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కు వచ్చే రైతులకు,హమాలీ జాడు దుదువాయి కార్మికులకు వేసవికాలం దృష్టిలో పెట్టుకొని మహజన్ నర్సింలు కూలింగ్ వాటర్ ఫిల్టర్ ను అందజేశారని వారికి అందరి తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నారని అన్నారు . ఈ కార్యక్రమంలో



మెంబర్ పుల్లూరు నవీన్, వ్యాపారులు మహజన్ నర్సింలు. పుప్పాల చిన్న అంజయ్య, మ్యాన శ్రీనివాస్, నిమ్మల భూమా రెడ్డి, కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి ఆపరేటర్ సతీష్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు


# యశోద లో కిడ్నీ మార్పిడికి అత్యాధునిక శస్త్ర చికిత్స. బ్లడ్ గ్రూప్ లు వేరైన కిడ్నీ మార్పిడి సాధ్యం.

### యశోద హాస్పిటల్ నెఫ్రాలజిస్ట్ లు డాక్టర్,, రాజశేఖర్ చక్రవర్తి, డాక్టర్,, జస్వంత్ చల్లా.




ప్రజాదర్బార్, కరీంనగర్ : కిడ్నీ మార్పిడికి అత్యాధునిక శస్త్ర చికిత్స యశోద హాస్పిటల్ లో అందుబాటులో ఉందని, బ్లడ్ గ్రూప్ వేరుగా ఉన్న రోగులకు సైతం కిడ్నీ మార్చవచ్చని ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రాజశేఖర చక్రవర్తి, డాక్టర్. జశ్వంత్ చల్లా తెలిపారు. కరీంనగర్లోని యశోద బ్రాంచ్ ఆసుపత్రి లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ హైదరాబాద్లోని యశోద హాస్పిటల్స్, హై టెక్ సిటీ యూనిట్ కిడ్నీ చికిత్స విభాగంలో అరుదైన రికార్డును నెలకొ ల్పిందని అన్నారు. ఇప్పటి వరకు 346 కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలను అత్యంత వి జయవంతంగా నిర్వహించి, ఎంతో మంది బాధితులకు పునర్జన్మ ప్రసాదించామన్నారు. వైద్య నిపుణులు కిడ్నీ మార్పిడిలో తాము సాధించిన విప్లవాత్మక పురోగతిని వివరించారు. సాధారణంగా కిడ్నీ మార్పిడికి రక్త గ్రూపులు కలవడం ప్రధానమైతే యశోద హాస్పిటల్స్ బృందం బ్లడ్ గ్రూప్ వె రుగా ఉన్న రోగులకు విజయవంతంగా కిడ్నీ మార్పిడి నిర్వహించి, వారు ప్రస్తుతం ఆరోగ్యకరమైన జీవితాన్ని గడిపేలా చేయడంలో విజయం సాధించమన్నారు. వయోభారంతో సంబంధం లేకుండా శస్త్ర చికిత్సల వి షయంలో వయస్సు ఒక అడ్డంకి కాదని యశోద వైద్యులు నిరూపించారు. 60 ఏళ్లు పైబడిన వృద్ధులలో కూడా కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలను వి జయవంతంగా పూర్తి చేసి, వారి ఆయుష్షును పెంచడంలో కీలక పాత్ర పోషించామని తెలిపారు. అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో కూడా అత్యాధునిక సాంకేతికతను ఉ పయోగించి ఈ మైలురాయిని చేరుకున్నామని అన్నారు. కిడ్నీ వైఫల్యంతో బాధపడి రోగులకు డయాలసిస్ అనేది కేవలం తాత్కాలిక ఉపశమనం మాత్రమే కానీ, కిడ్నీ మార్పిడి వల్ల రోగుల జీవన ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడుతుందన్నారు. తమ వైద్యబృందం 346 ట్రాన్స్ ప్లాంట్లు సంఖ్య మాత్రమే కదాని 346 కుటుంబాల్లో వెలుగులు నింపగలిగామన్నారు. యశోద హాస్పిటల్ హైటెక్ సిటీ యూనిట్, అత్యాధునిక మౌలిక సదుపాయాలతో అనుభవజ్ఞులైన వైద్య బృందంతో కిడ్నీ సంబంధిత వ్యాధులకు అంతర్జాతీయ స్థాయి చికిత్సలను అందిస్తూ దేశంలోనే అత్యుత్తమ ట్రాన్స్ ప్లాంట్ సెంటర్ గా ఎదుగుతుందన్నారు.

## ఆదిలాబాద్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో భూముల రిజిస్ట్రేషన్ పై ఫిర్యాదు..



ప్రజాదర్బార్ ఆదిలాబాద్ ప్రతినిధి ఏప్రిల్ 23: ఆదిలాబాద్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో భూముల రిజిస్ట్రేషన్ పై వచ్చిన ఫిర్యాదుల మేరకు గురువారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఉ దయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు ఐదుగురు సభ్యుల బృందం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో తనిఖీలు చేపట్టి డాక్యుమెంట్స్ ను పరిశీలన చేశారు. ఈ కార్యాలయంలో తరచుగా అక్రమ రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయని, కార్యాలయంలో పనిచేసే ప్రతి ఉద్యోగి సిబ్బందికి చేతులు తడపండి డాక్యుమెంట్ ముందుకు కదలదని ఆరోపణలు ఉన్నాయి. పైకం ఇచ్చుకో ఫైల్ పట్టుకో అన్న చిందంగా రిజిస్ట్రేషన్ల వ్యవహారం కొనసాగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇందులో భాగంగానే కొన్ని భూముల రిజిస్ట్రేషన్ కు సంబంధించి అక్రమ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని ఫిర్యాదుతో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి డాక్యుమెంట్లను పరిశీలన చేస్తున్నారు. ఈ డాక్యుమెంట్ల పరిశీలన సాయంత్రం వరకు కొనసాగాగ ఉండటంతో ఇంకా పల వివరాలు తెలియాల్సి ఉంది

# హైకోర్టు నివేదికను స్వాగతిస్తున్నాం -హైకోర్టులో ధర్మం గెలిచింది

### ప్రజలు కేసీఆర్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు-విలేకరుల సమావేశంలో అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్




మునిపల్లి , ఏప్రిల్ 23 ( ప్రజాదర్బార్ ) తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కక్ష సాధింపు కోసమే పీసీ ఘోష్ అనే నివేదిక అంశంలో.. హైకోర్టు లో ధర్మం గెలిచిందని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం పోల్కంపల్లి గ్రామ శివారులో గల పీఎస్ఆర్ గార్డెన్ బీఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు జైపాల్ రెడ్డి, పైతర సాయికుమార్ తోపాటు నాయకులతో కలిసి గురువారం స్థానిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయంటూ.. దీనిపై విచారణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్‌లపై కోర్టు కీలక తీర్పును వెల్లడించిందన్నారు. ఆ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దని హై కోర్టు ఆదేశించడం శుభపరిణామన్నారు. ఘోష్ కమిషన్ ఎలాంటి నిబంధనలు పాటించకుండా పీసీసీ కమిషన్ గా మారిందని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం కుంగిందని ముందస్తుగా నోటీసు ఇవ్వకుండా ఆరోపణలు చేయడం సరికాదని హైకోర్టు తీర్పు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్లు ఆయన తెలిపారు. హైకోర్టు తీర్పుతో కేసీఆర్, హరీష్ రావుతో పాటు ఐఏఎస్ అధికారులకు ఊరట దక్కడంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంప చెల్లుమన్నట్లైందన్నారు. అదే విధంగా కాళేశ్వరంలో ఒక పిల్లర్ కుంగితే దానిని రిపెయిర్ చేయాలి తప్ప.. మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టు కుంగి పోయిందని చెప్పడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందన్నారు. ఇదంతా రాజకీయ లబ్ది కోసమే ప్రభుత్వం ఆడిన నాటకమని తేలిపోయిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచే ప్రజలకు, రైతులకు నీరు అందుతుందన్నారు. ముఖ్యంగా అందోల్ నియోజకవర్గంలో గత కొన్నేళ్ల క్రితం నిర్మించిన సింగూరుప్రాజెక్టు ఇప్పుడు దానికి రిపెయిర్ చేస్తున్నారు.. కాని దానిని మొత్తం కూల్చి వేయడం లేదు.. కదా అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. అలాంటి దే కాళేశ్వరంలో కూడా ఒక పిల్లర్ కుంగితే మొత్తం కాళేశ్వరం కుంగిందని చెప్పడం విడ్డురంగా ఉ ందన్నారు. ప్రజా సమస్యలను పక్కన పెట్టి రాజకీయ కక్ష సాధింపు కోసమే సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం డ్రామాలు ఆడిందని, ఈ తీర్పుతో ఆ కుట్రలు బట్టబయలయ్యాయని క్రాంతికిరణ్ విమర్శించారు. ఇప్పటికైనా రాజకీయ దుష్ప్రచారం మానేసి, వెంటనే రెండు పిల్లర్ల మరమ్మతులు పూర్తి చేసి తెలంగాణ ప్రజలు, రైతుల ప్రయోజనాలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా.. న్యాయస్థానాల్లో ధర్మం గెలుస్తుందనడానికి ఇదే నిదర్శమన్నారు. ఈ సమావేశంలో రాయికోడ్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు చేవేళ్ల విఠల్, వరం కమిటీ మాజీ అధ్యక్షుడు వీరారెడ్డి, మునిపల్లి, రాయికోడ్ మండలాల ప్రధాన కార్యదర్శులు శశికుమార్, శంకర్, సర్పంచులు ఇర్ఫాన్ పటేల్, మల్లేశం, మాజీ సర్పంచులు శంకర్, మాజీ ఎంపీటీసీ చిట్కుల వెంకటేశం, నాయకులు తుకారం, నాయకులు బాగన్న, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల పట్ల యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి విడనాడాలి

బూర్గంపహాడ్, ప్రజాదర్బార్ ఏప్రిల్ 23: ఐటీసీ యాజమాన్యం కార్మికుల పట్ల నిర్లక్ష్య వైఖరి విడనాడి అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని, వేతన ఒప్పంద పెండింగ్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మిక జేఏసీ కన్వీనర్, బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము శంకర్రెడ్డి ఆధ్వర్యంలో ఐటీసీ కర్మాగారంలో అడ్మిన్ బ్లాక్ వద్ద కార్మికులు మూతికి నల్ల మాస్కులు ధరించి పెద్ద ఎత్తున మౌన ప్రదర్శన నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13వ వేతన ఒప్పంద పెండింగ్ సమస్యలు అలాగే ఉన్నాయని, 14వ వేతన ఒప్పందంలో జాప్యం జరుగుతుందని దీనికి ఐటీసీ యాజమాన్యం, గుర్తింపు సంఘం నిర్లక్ష్య వైఖరే కారణమన్నారు. త్వరితగతిన కార్మికులకు రూ. 22 వేల వేతన ప్యాకేజీ, వందశాతం అన్లిమిటెడ్ మెడికల్, బదిలీలందరినీ రెగ్యులర్ చేయడంతో పాటు కాంట్రాక్టు కార్మికులకు ఆమోదయోగ్యమైన వేతన చేస్తూ నిరసన తెలిపారు. గుర్తింపు సంఘంతో పాటు ఐటీసీ యాజమాన్యం కార్మికులకు మంచి వేతన ఒప్పందం చేయకపోతే గుర్తింపు సంఘాలు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పోరాటం మరింత ఉధృతం చేస్తుందని, ఇప్పటికైనా కార్మికుల సమస్యలు పరిష్కరించి వేతన ఒప్పందంలో మెరుగైన ప్యాకేజీ తీసుకురావాలని, లేనిపక్షంలో జేఏసీతో కలిసివస్తే మంచి వేతన ఒప్పందం చేయడానికి సహకారం అందిస్తామన్నారు.

# ఉపాధి పనుల్లో నాణ్యత పాటించాలి: జిల్లా కలెక్టర్ రాజర్షిషా..



ప్రజాదర్బార్ ఆదిలాబాద్ ప్రతినిధి ఏప్రిల్ 23: ఉపాధి పనుల్లో నాణ్యత పాటించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం తాంసి మండలం పొన్నారి గ్రామ శివారులో జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పూడికతీత పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, మస్టర్ రోల్స్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత ఆస్తుల కల్పన జరగాలని, పనుల నిర్వహణలో ఎక్కడా రాజీ పడకూడదని ఇంజనీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కూలీలు చేసిన పనికి తగిన వేతనం అందేలా కొలతలు ఖచ్చితంగా ఉండాలని స్పష్టం చేశారు. ఎండ తీవ్రత పెరుగుతున్నందున కూలీలు అస్వస్థతకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎండల తీవ్రత దృష్ట్యా ప్రతి పని ప్రదేశంలోనూ నీడ సౌకర్యం, మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. పనుల పరిశీలనలో భాగంగా కూలీలతో ముఖాముఖి మాట్లాడుతూ, పని ప్రదేశంలో మీకు కావాల్సిన సౌకర్యాలు అందుతున్నాయా? సకాలంలో వేతనాలు జమ అవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ స్వయంగా కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ రవీందర్, మండల అభివృద్ధి అధికారి మోహన్ రెడ్డి, తహశీల్దార్ లక్ష్మీ, సర్పంచ్ భీమన్న, ఏపీఓ విజయ, టెక్నికల్ అసిస్టెంట్ పుష్ప, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# అడవిదేవులపల్లి మండలంలో ఉపాధి హామీ,ఐకేపీ సెంటర్ల తనిఖీ



అడవిదేవులపల్లి,ఏప్రిల్ 23 ప్రజా దర్బార్: అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని ఉల్సాయిపాలెం గ్రామాల్లో డి ఆర్ డి ఏ పీడీ వై. శేఖర్ రెడ్డి గురువారం ఉపాధి హామీ పనులు నర్సరీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పనుల వద్ద కూలీల సౌకర్యాలపై ఆయన పలు ఆదేశాలు జారీ చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలకు ఎండ తగలకుండా టెంట్లు,త్రాగడానికి చల్లని నీరు,ఆరోగ్య రక్షణ కోసం ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు,ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఐకేపీ సెంటర్లను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు లారీల ద్వారా మిల్లులకు తరలించాలని సూచించారు.?నర్సరీలను సందర్శించి మొక్కల పెంపకంపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ?రైతులకు,కూలీలకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాగ్యా నాయక్,ఎంపీడీవో ఎండీ మోసిన్ బిన్ అహ్మద్, ఏపీఓ సూర నాయక్,ఏపీఎం రమణాకర్,పంచాయతీ కార్యదర్శి ఎం.రవికుమార్,టిఏ రాధ, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యారంగం అభివృద్ధి కి ప్రభుత్వం పెద్ద పీఠ సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్

కొడకండ్ల, ఏప్రిల్ 23( ప్రజాదర్బార్) ప్రభుత్వ పాఠశాల లో విద్యార్థులకు మెరుగైన వసతులను కల్పిస్తూ విద్యారంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం పెద్ద పీఠ వేస్తుంది అని కొడకండ్ల సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నీ మోడల్ స్కూల్, యు పి ఎస్ పాఠశాలలో జరిగిన పాఠశాల వార్షికోత్సవం లో ఆమె ఏం పి డి ఓ నాగ శేషాద్రి సూరి తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో వసతులను కల్పిస్తూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటుగా అల్పాహారం, మధ్యాహ్న భోజనం, ఉచిత యూనిఫాంలు, పుస్తకాలు, నోట్ బుక్ లను అందిస్తూ ప్రోత్సహిస్తు ఉంచాన్నారు. మోడల్స్ స్కూల్ లో ఉత్తమ ఫలితాలను రావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని అభినదించారు. త్వరలో ఏం ఎల్ ఎ యశస్వినీ రెడ్డి చేతుల మీదుగా ప్రోత్సాహకాలను అందిస్తామని తెలిపారు. యు పి ఎస్ కొడకండ్ల లో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం చాలా సంతోషమని ప్రభుత్వ పాఠశాలను సంరక్షించుకుందామని సూచించారు. అనంతరం విద్యార్థులు కు మెడల్ లను, బహుమతులను , ప్రోగ్రెస్ రిపోర్ట్ లను అందించారు. వేసవి సెలవులు విద్యార్థుల ను జాగ్రత్తగా చూసుకోవాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ షన్ను,మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ భాను ప్రసాద్, యు పి ఎస్ హెచ్ యం దోర్నం ప్రభాకర్, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.




# ప్రజలు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి





మధిర : ప్రజలు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మధిర మున్సిపల్ చైర్మన్ సామినేని సుజాత కోరారు. గురువారం మధిర మున్సిపాలిటీ పరిధి అంబర్ పేటలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సూచనలతో దెందుకూరు పీహెచ్ సీ వైద్యులు డాక్టర్ పృథ్వి నాయక్,మధిర ఏరియా హాస్పిటల్ కంటి డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరం,టీవీ డిజిటల్ ఎక్సరే క్యాంపు ను మున్సిపల్ చైర్మన్ సామినేని సుజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,ప్రభుత్వం,నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాలను ప్రజలు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలి,ఈ శిబిరాల్లో నిపుణులైన వైద్యులతో ఉచిత కంటి పరీక్షలు, కళ్లద్దాల పంపిణీ,కంటి శుక్లం వంటి వాటికి ఉచిత శస్త్రచికిత్సలు,మందులను అందిస్తారు అని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు, ఆర్థిక స్తోమత లేని వారికి, వృద్ధులకు ఈ సేవలు ఎంతగానో ఉపయోగపడతాయి వారి ఈ సేవలను నియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీస్ ర్ వి.వెంకటేశ్వర్లు,హెల్త్ సూపర్ వైజర్ లంకా కొండయ్య,మలేరియా డెంగీ నివారణ సూపర్ వైజర్ సుబ్బలక్ష్మి,ఏఎన్ఎంలు భారతి,రత్న మాల, రాజేశ్వరి,ఆశ కార్యకర్తలు, టీబీ యూనిట్ సిబ్బంది సంధిఫ్ శివ,3 వ వార్డు కౌన్సిలర్ బెజ్జం రాజు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జైనూర్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

జైనూర్,ప్రజా దర్బార్ న్యూస్, ఏప్రిల్ 23: రైతులకు న్యాయమైన ధర అందించాలనే లక్ష్యంతో జైనూర్ మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథ్ రావు, మేజర్ గ్రామపంచాయతి సర్పంచ్ కొడప ప్రకాష్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తమ పండించిన మొక్కజొన్నను మధ్యవర్తులకు తక్కువ ధరకు అమ్మకుండా నేరుగా మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు. ప్రభుత్వ మద్దతుతో క్వింటాల్‌కు రూ. 2,400 చెల్లించబడుతుందని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలు వారికి ఆర్థిక భద్రతను కల్పిస్తాయని,మార్కెట్‌లో జరుగుతున్న ధరల మార్పుల ప్రభావం నుంచి రక్షణ కల్పిస్తాయని పేర్కొన్నారు.

# ప్రతి విద్యార్థి పుస్తక పఠనం అలవర్చుకొని రచయితగా ఎదగాలి..

## విద్యార్థులు రచించిన 'మోదుగ మొగ్గలు' పుస్తకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా..



ప్రజాదర్బార్ ఆదిలాబాద్ ప్రతినిధి ఏప్రిల్ 23: ప్రతి విద్యార్థి పుస్తకపఠనం అలవర్చుకుని రచయితగా ఎదగాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. గురువారం తాంసి మండలం పొన్నారి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల రచించిన గేయాల సంపుటి 'మోదుగ మొగ్గలు' (పొన్నారి పిల్లల గేయాలు) పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల్లో అద్భుతమైన ప్రతిభ ఉంటుందని, వారి ఆలోచనలకు అక్షర రూపం ఇచ్చి 'మోదుగ మొగ్గలు' వంటి పుస్తకాలను తీసుకురావడం అభినందనీయామని కొనియాడారు. పుస్తకపఠనం వలన పిల్లల్లో ఊహాశక్తి, పఠనాసక్తి పెరుగుతాయన్నారు. నేటి డిజిటల్ యుగంలో పిల్లలు పుస్తక పఠనానికి దూరం కాకూడదని, బాధ్యతగా తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి సారించాలన్నారు. సరళమైన గేయాల ద్వారా భాషపై పట్టు సాధిస్తూ, ప్రతి విద్యార్థి ఒక రచయితగా ఎదగాలని ఆకాంక్షించారు. మారుమూల గ్రామంలోని విద్యార్థుల కోసం ఇలాంటి వినూత్న ప్రయత్నం చేసిన ఉపాధ్యాయ బృందాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. అనంతరం కలెక్టర్ విద్యార్థుల చేత పుస్తకంలోని గేయాలను చదివించి వారి మేధాశక్తిని పరీక్షించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ రవీందర్, ఎంఈఓ శ్రీకాంత్, మండల నోడల్ అధికారి రాజాశంకర్, ప్రధానోద్యాయులు సుజాత, ఎంఎంఓ లక్ష్మణ్, అసిస్టెంట్ ఆపిఎంఓ అజయ్ ఉపాధ్యాయులు సరిత, సర్పంచ్, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం అంశంలో హైకోర్టు తీర్పు స్వాగతం -కాంగ్రెస్,బీజేపీలు క్షమాపణ చెప్పాలి

## -భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి



యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి ప్రజాదర్బార్ ఏప్రిల్ 23: కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును బీఆర్ఎస్ నేతలు స్వాగతించారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం జరిగిన పత్రికా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి మాట్లాడుతూ,కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్,బీజేపీలు చేసిన ఆరోపణలు అసత్యమని అన్నారు. బీఆర్ఎస్ పార్టీని, కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీయడానికి కుట్ర పన్నారని విమర్శించారు.రెండున్నరేళ్ల పాటు మరమ్మ తులు అడ్డుకున్నారని,చివరకు వాటిని చేపట్టాల్సి వచ్చిందన్నారు.కాళేశ్వరం అంశంపై చేసిన ఆరోపణలకు కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణ ప్రజలకు,రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగినప్పుడల్లా అవినీతి ఆరోపణలతో దారి మళ్లిస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా అబద్ధపు ప్రచారం మానుకుని పాలనపై దృష్టి పెట్టాలని సూచించారు.అనంతరం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ,హైకోర్టు తీర్పుతో నిజం వెలుగులోకి వచ్చిందన్నారు.కాంగ్రెస్, బీజేపీల ఆరోపణలను ప్రజలు గమనిస్తున్నారని,రానున్న రోజుల్లో తగిన సమాధానం ఇస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కల్లూరి రాంచంద్రారెడ్డి,బీరు మల్లయ్య,పెంట నర్సింహ్మ,కేశవపట్నం రమేష్,చింతల కిష్టయ్య,పెంట నితీష్, అమ్జద్ తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాలోకులం మతాలు వర్గాల పై పోస్టులు పెడితే చట్ట రిత్యా నేరం



మహాదేవపూర్, ప్రజాదర్బార్, ఏప్రిల్ 23, సోషల్ మీడియా వేదికలైన వాట్సప్, ఫేస్ బుక్స్ ఇన్స్టాగ్రామ్ లలో కులం, మతం, వర్గాలపై ద్వేషాన్ని రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు, పోస్టులు లేదా సందేశాలు పంపడం చట్టరీత్యా నేరమని మహాదేవపూర్ పోలీసులు హెచ్చరించారు.సోషల్ మీడియాలోబాధ్యతారాహిత్యంగా తప్పుడు ప్రచారం చేయడం, అసత్య సమాచారం పంచుకోవడం లేదా ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం సమాజంలో అశాంతి, విద్వేషాలకు దారి తీస్తుందని పోలీసులు తెలిపారు. నిర్ధారణ లేని సమాచారం లేదా వివాదాస్పద వ్యాఖ్యలను పంచుకోవద్దని సూచించారు.ఎవరైనా కులం, మతం, వర్గాల మధ్య విద్వేషాన్ని రెచ్చగొట్టే విధంగా పోస్టులు లేదా సందేశాలు పంపినట్లు గుర్తించినట్లయితే, వారి పై చట్టప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని మహాదేవపూర్ పోలీసులు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.సమాజంలో శాంతి భద్రతలు కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని, అందరూ చట్టాలను గౌరవించి సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకోవాలని మహాదేవపూర్ సీఐ ఎన్. వెంకటేశ్వర్లు గారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# మాజీ ఐటిడిఏ డైరెక్టర్ భీమ్ రావ్ కు ఎమ్మెల్యే బొజ్జు పటేల్ నివాళి



జైనూర్,ప్రజాదర్బార్ న్యూస్, ఏప్రిల్ 23: జైనూర్ మండలం పానపటార్ గ్రామపంచాయతి పరిధిలోని గంగానగర్‌కు చెందిన ఐటిడిఏ మాజీ డైరెక్టర్ ఆత్రం భీమ్ రావ్ అనారోగ్యంతో మృతి చెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది. ఈ విషయం తెలుసుకున్న నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షులు,ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆయన స్వగ్రామానికి చేరుకుని భీమ్ రావ్ పార్థివదేహానికి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ ధైర్యంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం వారి కుటుంబానికి అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.భీమ్ రావు ఆదివాసి సమాజ అభివృద్ధికి చేసిన సేవలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తుచేసుకున్నారు. ఆయన మరణం సమాజానికి తీరని లోటుగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్,ఇంద్రవెల్లి మార్కెట్ వైస్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# కూలీల భద్రతకు తొలి అడుగు...

జైనూర్, ప్రజాదర్బార్ న్యూస్ ఏప్రిల్ 23: ఉపాధి హామీ పనుల్లో కూలీల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రథమ చికిత్స కిట్లను పంపిణీ చేశారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్ రెడ్డి స్వయంగా కిట్లను అందజేశారు. అయోడిన్, స్పిరిట్, కాటన్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటి అవసరమైన సామగ్రితో సిద్ధం చేసిన ఈ కిట్లు పనిస్థలాల్లో చిన్నపాటి గాయాలు, అస్వస్థత సమయంలో తక్షణ సహాయం అందించేందుకు ఉపయోగపడనున్నాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, కూలీల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ముఖ్యంగా ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉదయం వేళల్లోనే పనులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు.కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శశికుమార్, ఈజీఎస్ ఏపీవో నగేష్‌తో పాటు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో మౌలిక వసతుల కొరత

## -ఇండ్లు ఖాళీ చేస్తున్న కాలనీవాసులు.. సిపిఎం ఆందోళన

మోటకొండూరు,ప్రజాదర్బార్ ఏప్రిల్ 23:మోటకొండూరు మండలంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లలో మౌలిక వసతుల లేమితో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం నాయకులు తెలిపారు.ఈ నేపథ్యంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో కాలనీని పరిశీలించారు.ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కొల్లూరి ఆంజనేయులు మాట్లాడుతూ,ఇళ్ల నిర్మాణం పూర్తయినా మౌలిక సదుపాయాల కల్పనను ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. పట్టాలు ఇచ్చినప్పటికీ నీరు,విద్యుత్ వంటి సౌకర్యాలు లేక సుమారు 20 కుటుంబాలు ఇళ్లు ఖాళీ చేసినట్లు తెలిపారు.మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందడం లేదని,పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించలేదన్నారు.విద్యుత్ స్తంభాలు మంజూరైనప్పటికీ లైన్లు ఏర్పాటు చేయడంలో ఆలస్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.డబుల్ బెడ్‌రూం కాలనీలోని అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు.కార్యక్రమంలో కాలనీవాసులు ముత్యాల సంతోష్,గంజి సంతోష,శేఖర్,ఎత్తరి జ్యోతి,బాలనరసమ్మ,గిరిబోయిన సురేష్ ,గోరంటి నరసమ్మ,బీరకాయల రాఖి,జయమ్మ,సుశీల,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా దత్తాత్రేయ వార్షికోత్సవం



కాటారం, ఏప్రిల్ 23 ( ప్రజా దర్బార్) జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని ధన్వాడ గ్రామంలో శ్రీ దత్తాత్రేయ స్వామి వారి ఆలయ 5 వ వార్షికోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. రాష్ట్ర ఐ టీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్వగ్రామంలో జరిగిన కార్యక్రమంలో, మంత్రి మాతృ మూర్తి జయశ్రీ, మంత్రి సహోదరుడు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు దంపతులు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు, హోమాలు, యాగాలలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలు ఎల్లప్పుడూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీ దత్తాత్రేయ స్వామి వారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రతి కుటుంబం ఆనందంగా, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో భాగంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలు, యాగాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింతగా అలంకరించాయి. భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ పూజ కార్యక్రమంలో ధన్వాడ సర్పంచ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చీటూరి మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

# మిర్యాలగూడలో ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ భారీ మోసం

మిర్యాలగూడ ఏప్రిల్ 23 (ప్రజాదర్బార్):- మిర్యాలగూడ పట్టణానికి చెందిన రాంనగర్ బంధం నివాసి మిడసన మెట్ల రవి పలు ఆర్థిక నేరాలకు పాల్పడుతూ అందులో భాగంగా యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లో జాబు పోస్టులు ఇప్పిస్తానంటూ పలువురు అమాయకుల వద్ద లక్షల రూపాయలు తీసుకున్నాడు.. తను ఓ పత్రికలో టౌన్ రిపోర్టర్ గా పనిచేస్తున్నానని తన పేపర్ కి వైటిపిఎల్లో నాలుగు ఏఈ పోస్టులు ఇస్తారని అమాయకులను నమ్మించి ఒక్కొక్కరి నుండి సుమారు 5 లక్షల రూపాయలు వసూలు చేశారు.. అందులో ఒకరైన బాధిత మహిళ చక్రహరి ఒకలాదేవి గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... తనతోపాటు పద్మప్రియ ఆటో ఫైనాన్స్ దాంట్లో రికవరీ ఏజెంట్గా ఉన్నటువంటి మిడసనమెట్ల రవి నీ కొడుకుది బీటెక్ పూర్తయింది కదా వైటీపీఎల్లో మీ కొడుక్కి ఏఈ పోస్టు ఇప్పిస్తానంటూ నమ్మించి నాలుగు లక్షల 75 వేల రూపాయలు నగదు రూపంలో తీసుకోవడం జరిగిందని తెలియజేశారు. పలుమార్లు జాబు విషయంలో ఫోన్లో జరిపిన సంభాషణను విలేకరుల సమావేశంలో వినిపించడం జరిగింది.. అతి త్వరలోనే జీవో కాపీలు రిజిస్టర్ పోస్టులు వస్తాయని.. తొందరపడితే వచ్చే పోస్టులు కావని కాలయాపన చేస్తూ వచ్చాడు.. మోసపోయామని గ్రహించిన బాధిత మహిళ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది.. నాలాగా ఇంకెవరు మోసపోకుండా ఉండాలని ఉద్దేశంతోనే అతని పూర్తి వివరాలను మీడియా వారికి తెలియజేశారని చెప్పారు.. కావున గౌరవ పోలీస్ శాఖ వారు విచారణ జరిపి ఎవరెవరిదగ్గర ఎన్ని లక్షలు వసూలు చేశాడు, ఈ పోస్టులు ఇప్పించేది ఎవరు? వారికి ఎంతెంత ముట్ట చెప్పారు, దీని వెనక ఉన్న బడా బాబులు ఎవరు? ఎన్నేళ్లుగా ఈ దందా కొనసాగిస్తున్నారు? ఇలాంటి విషయాలను లోతుగా విచారణ చేపట్టి కఠినంగా శిక్షించాలని కోరారు.. మిడసనమెట్ల రవిని ఎవరూ కూడా నమ్మవద్దని ఇతని మాయమాటలకు ఎవరు కూడా డబ్బులు ఇవ్వవద్దని కోరారు..



# పౌష్టికాహారంతోనే ఆరోగ్య జీవనం...

జైనూర్, ప్రజాదర్బార్ న్యూస్: ఏప్రిల్ 23: పౌష్టికాహారం అలవాటు చేసుకుంటేనే ఆరోగ్యంగా ఉండగలమని జైసీబీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని జంగాం క్లస్టర్ సూపర్వైజర్ సంధ్యారాణి తెలిపారు. జంగాం అంగన్వాడీ కేంద్రంలో గురువారం పోషణ పక్షం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ పేందూర్ అనసూయ అర్జున్, మాజీ వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై, అంగన్వాడీ కేంద్రాల ద్వారా మహిళలు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ సంధ్యారాణి మహిళలకు పోషకాహార ప్రాముఖ్యత, ఆరోగ్య జాగ్రత్తలు, పిల్లల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు 'గ్రాడ్యుయేషన్ డే' నిర్వహించి ప్రీ-స్కూల్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

అడవిదేవులపల్లి ఏప్రిల్ 23 ప్రజా దర్బార్: అడవిదేవులపల్లి మండలంలో నిర్మిస్తున్న దున్నపోతుల గండి లిఫ్ట్ ఇరిగేషన్ పనులను స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఇరిగేషన్ అధికారులు సిఈ శ్రీనివాస్ రెడ్డి,ఎస్ సి మల్లిఖార్జున,ఈఈ కేశవ తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అనంతరం పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడారు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు.రైతుల సాగునీటి కష్టాలను తీర్చేందుకు ఈ ప్రాజెక్టు అత్యంత కీలకమని,పనులను త్వరితగతిన పూర్తి చేసి సాగునీటిని రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.రైతుల సంక్షేమం కోసం మన ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు.సాగునీటి రంగానికి ప్రాధాన్యతనిస్తూ ప్రతి ఎకరాకు నీరు అందించాలన్నదే మా లక్ష్యం అని బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని, నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు.?ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల శ్రీనివాస్,మండల పార్టీ అధ్యక్షుడు బాలు నాయక్,చిట్యాల సర్పంచ్ నక్క వెంకటేశ్వర్లు,మండల నాయకులు బండి నాగేశ్వరరావు,బండి నరసింహారావు,దశరథ్, రమేష్ నాయక్,గుండ శ్రీను,అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు బి ఎల్ ఆర్ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.



# యూరియా యాప్ ను వెంటనే రద్దు చేయాలి

# తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు

## బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, రైతు బంధు సమితి నల్లగొండ జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి



మిర్యాలగూడ ఏప్రిల్ 23 (ప్రజాదర్బార్):రేవంత్ సర్కార్ అమల్లోకి తెచ్చిన యూరియా యాప్ ను రైతు ప్రయోజనాల దృష్ట్యా తక్షణమే రద్దు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, రైతు బంధు సమితి నల్లగొండ జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసినట్లు తెలిపారు. చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తో పాటు మరో నలుగురు రైతులు దాఖలు చేసిన పిల్ పై హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ గౌస్ మీరా మొహియుద్దీన్ తో కూడిన ధర్మాసనం గురువారం విచారం చేపట్టింది. ఈ మేరకు 2 వారాల్లో సమగ్ర కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని సీజే తో కూడిన ధర్మాసనం ఆదేశించింది. హైకోర్టులో పిటిషనర్స్ తరఫున పాశం రవీందర్ రెడ్డి వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రైతులకు యూరియా యాప్ ద్వారా రైతులు యూరియా సప్లయి చేయడాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దాదాపు 70 లక్షల మంది రైతులు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు.రైతుల్లో అధిక శాతం మంది నిరక్షరాస్యులు. వీరిలో చాలా మంది దగ్గర స్మార్ట్ ఫోన్స్ లేవు. కొద్ది మంది వద్ద స్మార్ట్ ఫోన్ ఉన్నా యూరియా యాప్ డౌన్ లోడ్ చేసుకొని ఫోన్లో యాప్ ద్వారా బుక్ చేసుకొనే పరిజ్ఞానం లేదు. దీనివల్ల రైతులంతా వ్యవసాయ అధికారులపై, ప్రయివేట్ నెట్ సెంటర్లపై ఆధారపడాల్సిన దుస్థితి ఉన్నది.యూరియా యాప్ ద్వారా యూరియా బస్తాలు బుక్ చేయించుకోవాలంటే ఇతర సంస్థలపై రైతులు ఆధారపడి అధిక మొత్తంలో డబ్బులు చెల్లించాల్సి వస్తున్నది. అంతేగాకుండా రైతులంతా వారి వ్యవసాయ పనులను వదిలిపెట్టి యూరియా బస్తాల కోసం క్యూ లైన్లలో నిలుచోవాల్సిన దుస్థితి నెలకొంది. యూరియా కోసం రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.ఎకరానికి కనీసం ఒక బస్తా ఒకేసారి వేయాల్సిన అవసరముంది. 10 ఎకరాలు ఉన్న రైతుకు యాప్ ద్వారా బుక్ అయినట్లయితే 7 బస్తాలు మాత్రమే ఇస్తున్నారు. దీనివల్ల మిగతా 3 ఎకరాలకు బస్తాలు దొరకడం లేదు.15 రోజుల తరువాత మిగతా బస్తాల కోసం యూరియా యాప్ ద్వారా బస్తాల కోసం బుక్ చేసుకున్నా ఒక బస్తా కూడా ఇవ్వడం లేదు. రెండో విడతగా కూడా యూరియా వేయాల్సిన అవసరం ఉన్నది. 15 రోజుల కాలవ్యవధి తర్వాత కూడా 5 -6 బస్తాలు కూడా దొరకని దుస్థితి ఉన్నది. ఈ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోవడానికి కౌలు రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సెకన్లలో స్టాక్ మాయమవుతున్నది. అంతేగాకుండా కౌలు రైతులకు ఓటీపి చేప్పే లోపే స్టాక్ యమవుతున్నది. కౌలు రైతులు యూరియా బస్తాలు పొందాలంటే రైతుల పాసు పుస్తకాలు సమర్పించాల్సి ఉంటుంది.అసైన్ ల్యాండ్ ఉన్న రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చిన్న, సన్నకారు రైతులంతా యూరియా యాప్ ను ఎత్తి వేయాల్సిందిగా ముక్తకంఠంతో కోరుతున్నారు. ఈ యాప్ ఇలాగే కొనసాగినట్టయితే రైతులు బ్లాక్ మార్కెట్స్ బాట పట్టాల్సిన రోజులు ఇలాగే కొనసాగుతాయి.రైతులు యూరియాను సక్రమంగా వేయకపోయినట్టయితే పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోతుంది.రైతులు తీవ్రంగా నష్ట పోవాల్సి వస్తుందని చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి వెంట అంగోతు హాతీరాం నాయక్, మట్టపల్లి సైదులు, వేణుగోపాల్ రావు, పులి జగదీష్, హమీద్ షేక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

# ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్స్ వెంటనే పరిష్కరించాలి

## మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి



మెదక్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23:( ప్రజా దర్బార్ ) ఆర్టీసీ కార్మికుల సమ్మె పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడిచిపెట్టి తక్షణమే చర్చలు ప్రారంభించి, కార్మికుల న్యాయమైన డిమాండ్ లను పరిష్కరించాలని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షురాలు యం. పద్మ దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ డిమాండ్లపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మెదక్ ఆర్టీసీ డిపో గుల్షన్ క్లబ్ వద్ద కొనసాగుతున్న కార్మికుల రెండొవ రోజు సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. ఆర్టీసీ కార్మికులతో కలసి ర్యాలీగా డిపో వరకు వెళ్లి మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా పద్మదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ. కాంగ్రెస్ హామీలు అన్ని గంగలో కలిసాయని,ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని తీవ్రంగా విమర్శించారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఇప్పుడు అమలు కాకుండా తూతూమంత్రంగా పరిపాలన సాగుతోందని, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై విమర్శలు గుప్పించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, సమ్మె కొనసాగడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. గతంలో . మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికులకు పీఆర్సీ, సరైన గుర్తింపు ఇచ్చి గౌరవాన్ని కాపాడారని గుర్తు చేశారు.ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత, ప్రభుత్వంలో విలీనం, పీఆర్సీ ఫిట్మెంట్ వంటి హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయకుండా మోసం చేశారని ఆరోపించారు. దీనివల్ల కార్మికులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు టెంట్లు వేసుకుని సామరస్యంగా సమ్మె కొనసాగిస్తున్నప్పటికీ, మెదక్ ప్రాంతంలో మాత్రం పోలీసులు కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా మహిళా కార్మికులను కూడా పట్టించుకోకుండా అరెస్టు చేసి పాపన్నపేట్ పోలీస్ స్టేషన్కు తరలించడం తీవ్రంగా ఖండించారు.అరెస్టు చేసిన కార్మికులను వెంటనే విడుదల చేయాలని, వారి న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం తక్షణమే చర్చలు జరిపి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులకు పూర్తి స్థాయి ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించకుండా వాయిదాలు వేయడం వల్ల కార్మికుల్లో ఆందోళన పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా రవాణా వ్యవస్థకు వెన్నెముకలైన ఆర్టీసీ కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం తగదని, ప్రభుత్వం బాధ్యతాయుతంగా స్పందించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.ఉద్యోగాల భర్తీ, బకాయిల చెల్లింపు, సంఘ ఎన్నికల నిర్వహణ, ఔట్‌సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజేషన్ వంటి కీలక డిమాండ్లపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులు సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నప్పటికీ వారికి సరైన హక్కులు, భద్రత కల్పించకపోవడం అన్యాయమని విమర్శించారు. వారి శ్రమ దోపిడీని అరికట్టి తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన ఐఏఎస్ అధికారుల కమిటీ గడువు కోరడం సమ్మెను నీరుగార్చే ప్రయత్నంగా కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి సమస్యలను మరింత సంక్లిష్టం చేస్తుందన్నారు. కమిటీలు, నివేదికల పేరుతో కాలయాపన చేయకుండా ప్రత్యక్షంగా కార్మిక సంఘాలతో చర్చలు జరిపి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. సమ్మె కారణంగా సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యం దెబ్బతింటోందని తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులు, రోజువారీ కూలీలు ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే చర్చలు ప్రారంభించి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులు సంస్థ అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సంక్షేమం కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను అంగీకరించి సమ్మెను విరమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ మల్లికార్జున్ గౌడ్,జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ యం.లావణ్య రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి,న్యాయవాది జీవన్ రావు,పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, కౌన్సిలర్లు సోహెల్ జుబేర్ దీపక్ కుమార్, మెదక్ మాజీ వైస్ ఎంపీపీ మార్గం ఆంజనేయులు, ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు గడ్డమీద కృష్ణ గౌడ్,లింగారెడ్డి,సురేందర్ గౌడ్, వెంకటేశం,కాశినాథ్ రావు, అంజి రెడ్డి, వేణు,సాయికుమార్, రంజిత్, స్వామి నాయక్, యంబిపూర్. మహేష్ చంద్ పాషా, ఆర్టీసీ జేఏసీ జేఏసీ నాయకులు ఏంఆర్కే రావు, ఆర్టీసీ కార్మికులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రెండో రోజు కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మె

గద్వాల ఏప్రిల్ 23 (ప్రజాదర్బార్:ఆర్టీసి కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధన కోసం తెలంగాణ ఆర్టీసీ జకాస చేపట్టిన సమ్మె గురువారంతో రెండో రోజుకు చేరుకుంది. గురువారం గద్వాల ఆర్టీసి డిపోలో కార్మికులు విధులకు దూరంగా ఉండటంతో బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో ఆర్టీసీ యాజమాన్యం అద్దె బస్సులతో పాటు ప్రభుత్వ బస్సులను ప్రైవేటు డ్రైవర్లతో నడిపించారు. మొత్తం 110 బస్సులు ఉండగా 50 ఆర్టీసీ బస్సులు పోలీస్ బందోబస్తు మధ్య రోడ్డెక్కించారు. పోలీసుల రక్షణలో కండక్టర్లు లేకుండానే ప్రైవేటు హయ్యర్ బస్సులను నడిపారు. రోజు మాదిరిగా అన్ని ప్రాంతాలకు ఆర్టీసి బస్సులు నడపకపోవడంతో ప్రయాణికులు బస్టాండ్ కు చేరుకున్నా గంటల తరబడి వేచి చూస్తున్నారు. బస్సులు రాకపోవడంతో ప్రైవేటు ట్రావెల్స్ను ఆశ్రయిస్తున్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ప్రైవేటు వాహనదారులు ఛార్జీలు పెంచడంతో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, విద్యార్థులు, దినసరి కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు




డిమాండ్లపై హామీ ఇచ్చే వరకు సమ్మె కొనసాగిస్తామని కార్మికులు చెబుతున్నారు. గద్వాల ఆర్టీసీ డిపో వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె రెండో రోజు ఉధృతంగా కొనసాగింది. జిల్లా కేంద్రంలోని గద్వాల ఆర్టీసీ బస్సు డిపో ముందు పెద్ద ఎత్తున ధర్నాలు, ర్యాలీలు చేపట్టారు. ఈ సందర్భం గా డిపో ముందు నిర్వహించిన మహాధర్నాలో జేఏసీ నాయకులు, ఆర్టీసి కార్మికులు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమ ఓట్ల కోసం ఎన్నో హామీలు గుప్పించి, అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచిపోయినా అవి నెరవేర్చకుండా తమను మోసం చేశారని వారు ఆరోపించారు. కార్మికులపై మోయలేని పని భారాన్ని మోపుతూ, రోజువారీ ఆదాయం పై టార్గెట్లు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని, ఉదయం 5 గంటలకు డ్యూటీ ఎక్కితే రాత్రి 10 నుంచి 12 గంటల వరకు విధులు నిర్వహిస్తున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని, 30 శాతం తగ్గకుండా 2021 వేతన సవరణ అమలు చేయాలని, తదితర డిమాండ్ లను తెలంగాణ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# నేడు జిల్లాకు గవర్నర్ రాక

(ప్రజాదర్బార్ /మహబూబునగర్)రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల శుక్రవారం సాయంత్రం జిల్లా కేంద్రానికి రానున్నారు. స్థానిక స్టేడియం మైదానంలో ఏర్పాటు చేయనున్న అవార్డు ప్రధాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరు అయి పి ఎమ్ సంసద్ కేల్ మహోత్సవ కార్యక్రమంలో విజేతలైన వారికి అవార్డులు ప్రధానం చేస్తారు. గవర్నర్ శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు లోక్ భవన్ నుంచి బయలుదేరి సాయంత్రం 5.30 గంటలకు జిల్లా స్టేడియం మైదానానికి చేరుకుంటారు. సాయంత్రం 5.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు స్టేడియం మైదానంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని" పీఎం సంసద్ ఖేల్ మహోత్సవ" కార్యక్రమంలో విజేతలైన వారికి అవార్డుల ప్రధానం చేస్తారు. ఆ తర్వాత సాయంత్రం 6.30 గంటలకు స్టేడియం మైదానం నుంచి బయలుదేరి రోడ్డు మార్గం ద్వారా రాత్రి 8.30 గంటలకు లోక్ భవన్ చేరుకుంటారు.

# దివ్యాంగుల సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి.. జిల్లా కలెక్టర్ రాజర్షి షా

దివ్యాంగుల సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి దివ్యాంగుల కమిటీ సమావేశం నిర్వహించి, అజెండా అంశాలపై ఆయన సుదీర్ఘంగా సమీక్షించారు. ?ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని దివ్యాంగుల సమస్యల పరిష్కారం, వారి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. దివ్యాంగులకు ప్రభుత్వం కల్పిస్తున్న 4 శాతం రిజర్వేషన్లను అవుట్సోర్సింగ్ ఉద్యోగాల్లో ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. జిల్లాలో దివ్యాంగులకు అవసరమైన పింఛన్లు, ఖణ×ణ కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని, అర్హులకు స్వయం ఉపాధి పథకాల కింద రుణాలు, దుకాణాల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ?దివ్యాంగులు సమాజంలో గౌరవప్రదంగా



జీవించేందుకు ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో అడ్డంకులు లేని వాతావరణాన్ని కల్పించాలని అధికారులను ఆదేశించారు. అలాగే, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని దివ్యాంగులను స్వయం సహాయక సంఘాల్లో చేర్చి, వారికి సెర్ప్, మెప్మా ద్వారా ఆర్థిక చేయూతనివ్వాలని తెలిపారు. అంత్యోదయ కార్డుల జారీ, బస్సు, రైలు ప్రయాణ రాయితీలు, ఉపాధి హామీ పథకం పనుల్లో దివ్యాంగులకు కల్పించాల్సిన సౌకర్యాలపై దిశానిర్దేశం చేశారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, మునిసిపల్ కమీషనర్ రాజు, జిల్లా ఎస్సీ సంక్షేమ అభివృద్ధి అధికారి సునీత, ఈడి మనోహర్, డిపిఎండబ్లుఓ కలీం, రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, డిసిపిఎస్ఓ నందిని, మెప్మా డిఎంసి శ్రీనివాస్, లైన్ డిపార్ట్మెంట్ అధికారులు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా యువజన, క్రీడల అధికారిగా బాధ్యతలు చేపట్టిన జె రాజశేఖర్ రెడ్డి



మహబూబునగర్ అర్బన్, ఏప్రిల్ 23(ప్రజాదర్బార్): మహబూబునగర్ జిల్లా యువజన, క్రీడల అధికారిగా జె రాజశేఖర్ రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.

# హన్వాడ మండలం యారోనిపల్లి, గొండ్యాల గ్రామాలలో చేయవ్యాధి నిర్ధారణ శిబిరాల నిర్వహణ

## - 195 మందికి ఎక్స్ రే, 10 మందికి తెమడ పరీక్షలు నిర్వహించిన అధికారులు

(ప్రజాదర్బార్ /హన్వాడ) ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం (23.04.2026) హన్వాడ మండలంలోని యారోనిపల్లి, గుండ్యాల గ్రామాలలో క్షయ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 195 మందికి ఎక్స్ రే తీశారు. 10 మందికి తెమడ పరీక్షలు నిర్వహించారు. ఆయా గ్రామాలలో క్షయ వ్యాధి గురించి ప్రజలలో అవగాహన కల్పించారు. జాతీయ వాతావరణ మార్పులు, మానవ ఆరోగ్య కార్యక్రమం లో భాగంగా గ్రామాలలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు (212 మందికి) వడదెబ్బ నివారణ పైన అవగాహన కల్పించి 2207 మందికి ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందజేశారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణలో భాగంగా బాల నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని గ్రామాలలో దోమల నివారణ చర్యలు, ఇంటింటి సర్వే కార్యక్రమంలో 312 ఇళ్లను సందర్శించి దోమల నివారణ చర్యలు గురించి అవగాహన కల్పించారు.జ్వరం పీడితులు అయిన 17 లో 4 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. ఇంటింటికి తిరిగి దోమల లార్వాలు ఉత్పత్తి అయ్యే నీటితొట్లను, పూల కుండీలను, పాత టైర్లను బయట పడేశారు. ఎక్కడ కూడా నీటి నిల్వ ఉండకుండా చూడాలని ప్రజలకు అవగాహన కల్పించారు.



# కలెక్టరేట్లో ఘనంగా మహర్షి భగీరథ జయంతి వేడుకలు

నిర్మల్, ఏప్రిల్ 23(ప్రజాదర్బార్)కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో గురువారం భగీరథ మహర్షి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా పలువురు అధికారులు, నాయకులు భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలువురు మాట్లాడుతూ మహర్షి భగీరథ మహర్షి గొప్పతనం విశేషాలను వివరించారు. ఈ జయంతి వేడుకలలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఎల్డిఎం రామ్ గోపాల్, పలువురు సంఘాల నాయకులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# భగీరథ మహర్షి ఒక గొప్ప తపస్వి

## సరే నీకు నెట్వర్క్ లేదు ప్రసన్నుడై శివ పరమాత్ముడు గంగాదేవిని భూమి పైకి పంపించాడు : జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా



(ప్రజాదర్బార్ /మహబూబునగర్)భగీరథ మహర్షి ఒక గొప్ప తపస్వి అని,ఆయన చేసిన తపస్సుకు ప్రసన్నుడై శివ పరమాత్ముడు గంగాదేవిని భూమి పైకి పంపించాడు అని జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా అన్నారు. మహర్షి భగీరథ జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహర్షి భగీరథ జయంతి సందర్భంగా కలెక్టర్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తో కలిసి గురువారం పద్మావతి కాలనీ గ్రీన్ బెల్ట్ వద్ద ఉన్న భగీరథ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భగీరథ మహర్షి ఒక గొప్ప తపస్సు అని, ఆయన చేసిన కఠోర తపస్సు మూలంగానే శివుడు ప్రసన్నమై గంగాదేవిని భూమి పైకి పంపించాడని అన్నారు. ఒకానొక కాలంలో పృథ్వి పై నీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో భగీరథ మహర్షి శివుడి గూర్చి కఠోర తపస్సు చేసి చేశారు. ఆయన తపస్సుకు ప్రసన్నుడై పరమశివుడు గంగాదేవిని భూమి పైకి పంపించారని అన్నారు. ఈ కారణంగానే మనం గంగానదిని భాగీరథి అని పిలుస్తున్నామని అన్నారు. భగీరథ మహర్షి గంగానదిని భూమి పైకి తీసుకువచ్చి మానవాళి పాపాలను పోగొట్టేందుకు చేసినా కట్ హోర తపస్సు భారతీయ సంస్కృతిలో విశిష్ట స్థానాన్ని కలిగి ఉందని తెలిపారు. ఆయన చూపిన దీక్ష, సంకల్పం, నిస్వార్థ సేవా హోమం నేటికీ ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజంలో ఉన్న అసమానతలు, అన్యాయాలను తొలగించేందుకు భగీరథ మహర్షి అడుగుజాడలలో నడవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత ఆయన జీవితం నుండి స్ఫూర్తి పొందాలని సూచించారు. ఆ మహాపురుషుని జయంతి సందర్భంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని కలెక్టర్ అన్నారు. ప్రజలందరికీ భగీరథ మహర్షి జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుమ్మాల మమత, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇందిర, స్థానిక ప్రజా ప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# 2026-27 విద్యా సంవత్సరానికి గిరిజన అభ్యర్థుల నుండి దరఖాస్తుల ఆహ్వానం

## గిరిజన అభివృద్ధి అధికారి శత్రు నాయక్

మహబూబునగర్ అర్బన్, ఏప్రిల్ 23(ప్రజాదర్బార్): మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన అర్హులైన గిరిజన బాలబాలికల నుండి 2026-27 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కింద 3,5,8 తరగతులలో ప్రవేశాల కోసం గిరిజన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి శత్రు నాయక్ తెలిపారు. జిల్లాలో ఈ పథకం కింద మొత్తం 35 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థులు మే నెల ఏడవ తేదీలోగా జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయం రూం నెంబర్ 123, మొదటి అంతస్తు, జిల్లా కలెక్టర్ కార్యాలయాల సముదాయం, పాలకొండ మహబూబ్ నగర్ లో పూర్తిచేసిన దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. ఏప్రిల్ 22 నుండి దరఖాస్తులను ఉచితంగా పొందవచ్చని ఆయన తెలిపారు. జిల్లా స్థాయిలో వచ్చిన దరఖాస్తులను మే 14న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లాటరీ పద్ధతి ద్వారా 35 మందిని ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తు పేదలచిన బాలబాలికల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతం వారికి 1,50,000 రూపాయలు, పట్టణ ప్రాంతం వారికి రెండు లక్షల రూపాయలు ఉండాలని తెలిపారు. కుల నివాస ఆదాయ ధ్రువీకరణ పత్రాలను తహసిల్దార్/మీసేవ కేంద్రాల ద్వారా పొందిన వాటిని జిరాక్స్ ప్రజలకు 2 పాస్ పోర్ట్ సైజు ఫోటోలు, ఆధార్ కార్డులను దరఖాస్తుకు జతపరిచి సమర్పించాలని ఆయన పేర్కొన్నారు.


# తెలంగాణ గిరిజన గురుకుల(మహిళ) డిగ్రీ కళాశాలలో ఇంపాక్ట్ కార్యక్రమం లో భాగంగా విద్యార్థినుల తల్లిదండ్రులతో సమావేశం



మహబూబునగర్ రూరల్, ఏప్రిల్ 23(ప్రజాదర్బార్):ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సంక్షేమ వారోత్సవాలలో భాగంగా గురువారం తెలంగాణ గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఇంపాక్ట్ కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థినుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మహబూబ్నగర్ సమీపంలో ఉన్న పోచమ్మ గడ్డ తండాకు చెందిన గ్రామ సర్పంచ్ శ్రీకాంత్, పంచాయతీ బోర్డు కార్యదర్శి ఆనంద్, తెలంగాణ గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రధాన ఆచార్యులు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు. ఈ సమావేశం లో 2026-27 విద్యా సంవత్సరం కొరకు విద్యార్థినుల ప్రవేశం కోసం, అడ్మిషన్ల బ్రోచర్, పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గురువారం కళాశాల ప్రగతి, విద్యార్థినులు పొందిన ఫలితాలు, విజయాల గురించి తెలియజేశారు. అలాగే కార్యదర్శి ఆనంద్ విద్యార్థినులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ డిగ్రీ విద్య యొక్క ఆవశ్యకత గురించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ముఖ్య అతిథులను సన్మానించారు.

# నారాయణపేట జిల్లా తెలంగాణ ఉద్యమ అధ్యక్షులుగా మ్యాతరి కృష్ణ

మద్దూరు, మండల్ ఏప్రిల్ 23 ప్రజా దర్బార్ మద్దూరు, హైదరాబాద్ లోని తెలంగాణ సచివాలయం లో గురువారం, తెలంగాణ తోలి రాజ కార్పొరేషన్ చైర్మన్ డా. పిడమర్తి రవి తెలంగాణ ఉద్యమం లో పాల్గొన వారి కోసం ఒక వేదిక ఏర్పాటు చేయాలని అందులో భాగంగా నారాయణ పేట్ జిల్లా అధ్యక్షులు గా కొడంగల్ నియోజకవర్గం మద్దూర్ మున్సిపాలిటీ కి చెందిన తెలంగాణ ఉద్యమం లో ఎన్నో కేసు ఎదుర్కొని, లాఠీ దెబ్బలు తిన్న నికర్సైనా తెలంగాణ ఉద్యమ కారుడు మ్యాతరి కృష్ణ ని నారాయణ పేట్ జిల్లా అధ్యక్షులు గా నియమించడం జరిగింది. రాబోయే రోజుల్లో తెలంగాణ వ్యాప్తంగా ఉద్యమ కారుల్ని ఏకం చేసి వారి సమస్యల పట్ల ప్రభుత్వనికి చెప్పే విధంగా మన పోరాటం ఉండాలని పిడమర్తి రవి సూచించడం జరిగింది. నారాయణ పేట్ జిల్లాలో అన్ని వర్గాలకు చెందిన ఉద్యమకారులను కలుపుకొని పోవాలని అన్ని మండలలో మండల గ్రామ కమిటీలు వేయాలని కోరడం జరిగింది. కార్యక్రమం లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఇంచార్జి బొర్రా సురేష్, మరియు బోర్రెల్లి సురేష్ ఉస్మానియా యూనివర్సిటీ ఇంచార్జి రాజశేఖర్ ఉమ్మడి మహబూబ్ నగర్ నాయకులు, వీణ బహుజన నాయకులు భరత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# గలీజు పనులతో అడ్డంగా బుక్కు..!

**- మహిళ ఉద్యోగి తో రాసలీలలు చేస్తూ అడ్డంగా దొరికిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ డేటా ఎంట్రీ ఆపరేటర్**
**- ములుగు రోడ్డు లాడ్జిలో పోలీసులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడినట్లు సమాచారం..!- రాసలీల బాగోతం జరిగి మూడు రోజుల అయిన బయటకు పొక్కకపోవడం విచిత్రం..**



వరంగల్ ప్రతినిధి ప్రజాదర్బార్ ఏప్రిల్23 సుప్రీయం సుఖమే వినోదం సుఖం కోసమే అక్రమ సంబంధం అనేలా కొందరు ఉద్యోగులు బరీ తెగిస్తున్నరూ. హన్మకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు సిబ్బంది హనుమకొండ ములుగు రోడ్డులోని ఓ లాడ్జిలో రాసలీలలు చేస్తూ పోలీసులకు రెడ్ హ్యాండెడ్ గా చిక్కడం జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో కలకలం రేపింది. ఇది ఇలా జరగగా ఈ విషయం బయటకు పొక్కకుండా కొందరు ప్రయత్నించడం విస్మయానికి గురిచేస్తుంది. ప్రజలకు సేవ చేసి ప్రజల చేత శభాష్ అనిపించుకోవాల్సిన ఉద్యోగులు ఇలా పాడు పనులు చేస్తూ వారు పని చేస్తున్న శాఖ పరువును బజారున పడేస్తున్నారు. హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డిప్యుటేషన్ మీద పనిచేస్తున్న ఒక వివాహిత, అదే కార్యాలయంలో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్ తో నాలుగు రోజుల క్రితం రాసలీలల్లో మునిగి సుఖ వినోదంలో తెలియాడుతూ ఉండగా స్థానిక పోలీసులకు చిక్కినట్లు విశ్వసనీయ సమాచారం.! యి అక్రమ సంబంధం లాడ్జిలో బయటపడడంతో డాటా ఎంట్రీ ఆపరేటర్ భార్య తనను తన భర్త ఇన్ని రోజులుగా వేధించడానికి కారణం తెలిసి వచ్చిందని ఇన్ని రోజులు కారణం తెలియక మదన పడ్డానని తన ఆవేదనను పిర్యాదు రూపంలో పోలీసులకు అందజేసిన కేసు బహిరంగం కాకపోవడం విస్మయానికి గురిచేస్తుందనీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగులు గుసగుసలాడుకుంటున్నారు. ఇదేమీ బలుపు చక్కగా ఉద్యోగం చేసుకోక పాడు పనులు చేస్తూ గలీజు ఘటనతో దొరికిపోయి శాఖ పరువు తీయడం పై వైద్య ఆరోగ్యశాఖ జిల్లా సిబ్బంది ఆవేదన చెందుతున్నారు.

## సీఎం సహాయనిధి చెక్కులు అందజేత



చిట్యాల ఏప్రిల్ 23(ప్రజాదర్బార్) చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో ఇటీవల కాలంలో అనారోగ్యంతో చికిత్స పొందిన చింతపల్లి లక్ష్మమ్మ,మోర అనిత లకు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సహకారంతో మంజూరు చేయించిన సీఎం సహాయ అనేది చెక్కులను గ్రామ సర్పంచ్ కాటం వెంకటేశం అత్యవసర సమయాల్లో సీఎం సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం నిరుపేదల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఓర్సు సైదులు,వార్డు సభ్యులు కురు యాదయ్య,సాగర్ల నాగరాజు,మర్రి హరీష్ రెడ్డి,జేల్లా ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# దక్షిణ మధ్య రైల్వే జోన్ లో

# కొత్త బెంచ్ మార్క్ సాధించిన విజయవాడ డివిజన్

**- గత రికార్డులను బద్దలు కొట్టిన వైనం- టికెట్ చెకింగ్ ద్వారా కేవలం 22 రోజుల్లో 10 కోట్ల ఆదాయం**

(ప్రజాదర్బార్ /విజయవాడ) దక్షిణ మధ్య రైల్వే చరిత్రలో విజయవాడ డివిజన్ కొత్త బెంచ్ మార్క్ సాధించింది. నెలవారి టికెట్ చెకింగ్ సందర్భంగా ఏప్రిల్ నెలలో కేవలం 22 రోజుల్లో 10 కోట్ల రూపాయల ఆదాయాన్ని సాధించింది. ఇది దక్షిణ మధ్య రైల్వే చరిత్రలో మరుపురానిఘట్టం. అంటే ఏప్రిల్-2026 నెలలో టికెట్ చెకింగ్ ద్వారా ఏకంగా 10 కోట్ల రూపాయల అదనపు ఆదాయాన్ని సాధించింది. ఇది ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి 22వ తేదీ వరకు సాధించిన అద్భుతం. నెల రోజులకు ఇంకా వారం రోజులు మిగిలి ఉండగానే విజయవాడ డివిజన్ టికెట్ చెకింగ్ ద్వారా 10 కోట్ల రూపాయలు ఆదాయం సంపాదించడం రైల్వే చరిత్రకే గర్వకారణమని అధికారులు చెబుతున్నారు. 2025 ఏప్రిల్ నెలలో టికెట్ చెకింగ్ ద్వారా 8.59 కోట్ల రూపాయల ఆదాయాన్ని సంపాదించిన విజయవాడ డివిజన్ 2026 ఏప్రిల్ లో కేవలం 22 రోజుల్లో 10 కోట్ల రూపాయల ఆదాయాన్ని సాధించి గత రికార్డును బద్దలు కొట్టింది. విజయవాడ డివిజన్ పరిధిలోని అన్ని మేజర్ రైల్వేస్టేషన్ల లో పకడ్బందీగా టికెట్ చెకింగ్ కార్యక్రమం చేపట్టిన కారణంగానే ఈ ఆదాయం లభించిందని రైల్వే అధికారులు చెబుతున్నారు. ఈ సందర్భంగా విజయవాడ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సోనాకియా ఈ అద్భుతాన్ని సాధించిన టికెట్ చెకింగ్ సిబ్బందిని, వాణిజ్య విభాగాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ చర్యల వల్ల రైల్వే శాఖకు ఆదాయం రావడంతో పాటు తప్పుడు మార్గంలో టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న ప్యాసింజర్లకు హెచ్చరికగా పనిచేస్తుందని డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సోనాకియా అన్నారు. సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ బి ప్రశాంత్ కుమార్ మార్గదర్శకత్వంలో అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ ఐ ఎస్ ఆర్ మూర్తి , ఆయన టీం సభ్యులు తమదైన తేదీలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కేవలం 22 రోజుల్లో 10 కోట్ల రూపాయల ఆదాయాన్ని సంపాదించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో టికెట్ చెకింగ్ ద్వారా డివిజన్ 76.34 కోట్ల రూపాయల వార్షిక ఆదాయాన్ని సాధించింది. టికెట్ లేకుండా ప్రయాణించి టికెట్ చెకింగ్ సిబ్బందికి పట్టు పడ్డప్పుడు తోటి ప్రయాణికుల ముందు చులకన అవడంతో పాటు, ఒక్కొక్కసారి జైలు జీవితాన్ని సైతం గడపాల్సి వస్తుందని, అందుకు ఇలాంటి దురలవాట్లను దూరం చేసుకుని టికెట్ తీసుకుని దర్జాగా రైళ్లలో ప్రయాణించాలని డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సోనాకియా ప్రయాణికులకు సలహా ఇచ్చారు.

